చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక

జనవరి 2022

రు. 20/-



సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రకటన
96
HAPPY
Birth
96 వ జన్మదినం జరుపుకున్న
శ్రీ మంగళంపల్లి అప్పలనరసింహామూర్తి

వ్యవస్థాపక సంపాదకురాలు
తీగవరపు శాంతి

చైతన్యం
సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

జనవరి 2022

సంపుటి -11 సంచిక - 4

ఈ సంచికలో....

సంపాదకీయం	4
పాశురం - 1	6
పూరీ జగన్నాధస్వామి వైభవం	7
గ్రీసు దేశపు పురాణ గాథలు	11
పదిలమైన కాపురానికి 12 సూత్రాలు	15
సప్త మోక్ష నగరాలు	17
116 కందాల్లో సుందరకాండ	23
ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్	26
మానవజీవన రహస్యం	33
ప్రేమంటే ఇంతే	36
మా ఊరి నందుల కథ	38
రుక్మిణి కళ్యాణం	41
అత్యంబుపానము	43
కవిత్వానికి పర్యాయపదం ఎన్ గోపి	44
ఆదర్శ జీవితం -మంగళంపల్లి నరసింహమూర్తి	49

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

పాఠక దేవుళ్లకు నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రముఖ ప్రజా కవి, తెలంగాణా వాగ్గేయ కారుడు, ఎమ్మెల్సీ శ్రీ "గోరెటి వెంకన్న" వ్రాసిన పుస్తకం "వల్లంకి తాళం" కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. మానవీయ సంస్కృతి, స్వచ్ఛమైన ప్రకృతి మేళవింపుగా "వల్లంకి తాళం" కవితా సంపుటిని తీర్చిదిద్దారు. కార్పొరేటిజం పెరుగుతున్న సమయంలో సాహిత్యానికి మరింత గౌరవం పెంచే విధంగా వ్రాయడం అందరూ గర్వించదగ్గ విషయం

2021వ సంవత్సరం ముగిసి 2022 లోకి అడుగుపెడుతున్నాము అని ప్రజలు ఒక పక్క ఆనందంగా ఉన్నారు. నూతన సంవత్సర సంబరాలు జరుపుకోవాలని ఉబలాటం ఒక పక్క అయితే, తొందర్లోనే ఆంధ్రులకు అతి ముఖ్యమైన పండుగ సంక్రాంతి. సంక్రాంతికి ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఉంటారు. కొత్త పంటలు చేతికి వచ్చి, పంటలు అమ్మగా వచ్చిన డబ్బుతో కొత్త బట్టలు కొనుక్కోవడం, కోడి పందాలు, అంతా సొంత ఊళ్ళకి వెళ్లడం లాంటి సరదాలెన్నో. అన్నిటి కన్నా ముఖ్యంగా కొత్త అల్లుళ్లను ఇంటికి పిలవడం, మర్యాదలు, కొత్త సినిమాలు రిలీజ్ అవడం ఇలాంటి సరదాలెన్నో. మరో పక్క ఈ కోవిడ్ వేరియంట్ రక రకాల పేర్లతో రూపం దాలుస్తూ ఉంటే ఇప్పటికే విసిగి పోయి ఉన్న ప్రజలు కోవిడ్ నిబంధనలు కూడా సరిగా పాటించడం లేదు, దాంతో "ఒమిక్రాను" అనే వేరియంట్ ప్రజల్లో విజృంభిస్తోంది.

ఈ వేరియంట్ "కరోనా" అంత ప్రమాదం కాక పోయినా వర్క్ చేయడానికి వీలుకాక ఇబ్బంది పెడుతోంది. ఎంత ఇబ్బంది అంటే అమెరికాలో అయితే డాక్టర్లకి, నర్సులకి అందరికీ ఒమిక్రాన్ వచ్చి సీడిసీ రూల్స్ ప్రకారం 10 రోజులు సెలవలు ప్రకటించవలసి రాగా 5 రోజుల కన్నా లీవ్ తీసుకుందుకు వీలు లేదు పాజిటివ్ వచ్చిన వాళ్ళు. ఇక అమెరికా లోని కొన్ని హాస్పిటల్స్ అయితే 3 రోజులకే సెలవలు కుదించారు. ఇది ప్రమాదకరమైనది కాదు కానీ బాగా ఒళ్ళు నొప్పులు, జలుబు, తల నొప్పి లాంటివి బాగా ఉంటాయి. అందువల్ల బాగా సిక్ అయ్యి, నీరసపడి పోతున్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ప్రజలంతా పడుతున్న ఇబ్బందే.

ప్రపంచమంతా మళ్ళీ ఆంక్షలు

బూస్టర్ డోసు తీసుకుంటే క్వారంటైన్ సమయం తగ్గించి, వేసుకోని వారిపై కొత్త ఆంక్షలు విధిస్తున్నాయి పలు దేశాలు. ఒమిక్రాన్ ప్రపంచమంటా విస్తరిస్తుంటే చాలా దేశాలు ప్రజలపై పలు ఆంక్షలు విధించాయి, మాస్కులు ధరించడం, భౌతిక దూరం తప్పనిసరి చేసింది, మాస్క్ లేక పోతే ఫ్రాన్స్ జరిమానా విధిస్తోంది. ఇక చైనా అయితే సరుకులు ఇంటి వద్దకే పంపించే ఏర్పాట్లు చేస్తోంది. అంతే కాదు పలు నగరాల్లో చైనా లాక్ డౌన్ విధించి, జీరో కోవిడ్ వ్యూహంతో చైనా నానా తంటాలు పడుతోంది, ఒక పక్క ఒలింపిక్స్ దగ్గర పడుతోంది, కోవిడ్ ను కట్టడి చేయలేక నానా తంటాలు పడుతోంది చైనా.

మన తెలంగాణా సంక్రాంతి పండగ సమయంలో మూడోదశ వ్యాప్తి చెందే అవకాశం

ఆరోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. కోవిడ్ విషయంలో అందరూ జాగ్రత్త-గా ఉండాలని, లేదంటే పరిస్థితి తీవ్రతరం కావచ్చని డాక్టర్ శ్రీనివాస్ ప్రజలను హెచ్చరించారు. ఒమిక్రాన్ వేరియంట్ ఇప్పటికే ప్రారంభమైందని, వచ్చే 2 నుండి 4 వారాలు అత్యంత కీలకమని చెప్పారు. అంతే కాదు ఒమిక్రాన్ వేరియంట్ డెల్టా కన్నా 6 రెట్లు వేగంగా విస్తరిస్తోంది. అంతే కాదు డెల్టా బారి నుండి బయట పడాలంటే ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటించి నూతన సంవత్సర వేడుకలు , సంక్రాంతి పండగ సంబరాలు కుటుంబ సభ్యులతో మాత్రమే జరుపుకోవాలి. అంతే కాదు గుంపులుగా ఉంటే తప్పకుండా మాస్క్ ధరించాలి. ఇది రెండవ ప్రమాద హెచ్చరిక అనీ, ఇప్పుడు జాగ్రత్తలు పాటించకపోతే ,,,మూడో ప్రమాద హెచ్చరిక కూడా వచ్చేస్తుంది అని డీహెచ్ హెచ్చరించారు.

ఇంత హెచ్చరికలు చేస్తున్నా సంక్రాంతికి 14 ప్రత్యేక రైలు సర్వీసులు నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ఒక ప్రకటనలో తెలపడం ప్రత్యేకత.

భారత దేశానికి చెందిన కెనడియన్లకు ఆ దేశ అత్యున్నత పౌర పురస్కార గౌరవం దక్కింది. ముగ్గురు భారతీయ సంతతికి చెందిన వారు ప్రముఖ శాస్త్ర వేత్త డాక్టర్ వైకుంఠం అయ్యర్ లక్ష్మ-ణన్, రియల్ ఎస్టేట్ వ్యాపారి బాబా సింగ్ దిల్లాన్, పిల్లల వైద్యుడు డాక్టర్ ప్రదీప్ మర్చంట్ ఆ దేశ అత్యున్నత పురస్కారం "ది ఆర్డర్ ఆఫ్ కెనడా " అవార్డు దక్కడం గర్వకారణం.

సంగారెడ్డి జిల్లాలోని సుల్తాన్ పూర్ లో వైద్య పరికరాల పార్కు పురోగతి చెందుతోంది. ప్రపంచం మొత్తం మీద 1800 వైద్య పరికరాల పరిశ్రమలుండగా ... భారత దేశం లో ఉన్నవి 120. అందులోనూ తెలంగాణలో 50 ఉన్నాయి. 10,000 రూ ||ల కోట్ల పెట్టుబడితో 50 పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయి. 9లక్షల మందికి ఉపాధి కల్పించడమే దీని లక్ష్యం.

2022 నూతన ఆంగ్ల సంవత్సరంలో అయినా ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంపదతో ఆనందంగా ఉండాలని కోరుకుంటూ..

సర్వేజనా సుఖినో భవంతు

తీగవరపు శాంతి
ఎడిటర్

పాశురం - 1

భువనచంద్ర

మార్గశిర మాసమే .... ఇది.... మార్గశిర మాసమే... చెలియా
మార్గశిర మాసమే... వెన్నెలలు కురియు శుభదినమే.. నెర
వెన్నెలలు కురియు శుభదినమే.....
సుందరమగు ఆభరణములు దాల్చి ... మందగమనమున
పోదమటే .... వ్రతస్నాన మాచరించ పోదమటే ... ॥మా॥

వాడియైన వేలాయుధమును ధరియించి పుత్రునీ కాచెడు - ఘన
శ్రీ నందగోపునీ సుతుని జూడ - వ్రత సాధనమగు ఆ, పర ను పొందగా
మందగమనమున పోదమటే .... వ్రతస్నాన మాచరించ పోదమటే ... ॥మా॥

అందమైన కన్నులతో అలరారు యశోద మాతకు బాల సింహుడు
సూర్యుని వలె వెలుగొందు వాడు - చల చల్లని వెన్నెల చిలుకు వాడు
నారాయణుడొక్కడే ముక్తి దాత, అని చాటి చెప్ప వ్రతమాచరించగా ॥మా॥

పూరి జగన్నాధ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమై నదీ.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్మ్యాన్ని యధామూ లంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

\- సంపాదకురాలు

33 వ అధ్యాయం

గుడించా యాత్ర

వైశాఖ శుక్ల తదియ రోజున ఈ ఉత్సవాన్ని నిర్వహించాలి. ఆ రోజు రాజు పూజారులను నియమించాలి. ముగ్గురు వడ్రంగులను కూడా నియమించాలి. కావసిన వస్త్రాలు, అలంకారాలు సిద్ధం చేసుకోవాలి. అందరిని తీసుకొని రాజు అరణ్యానికి వెళ్లాలి. అగ్నిని సిద్ధంచేసుకొని,మంత్రయుక్తంగా నూటఎనిమిది సార్లు హవనం చేయాలి. తరువాత అక్కడ ఉన్న చెట్లకు నేతితో అభిషేకం చేయాలి.వనదేవతలకు నూట ఎనిమిదిసార్లు హవనం చేయాలి.ఆచార్యుడు గొడ్డలి తీసుకొనినేతితో తడిపి కొద్దిగా చెట్టు మొదట్లో నరకాలి.మంగళ వాయిద్యాలు మ్రోగుచుండగా వడ్రంగిని అక్కడ నియమించి,అందరు తిరిగి వెళ్ళిపోవాలి. (1 - 9)

స్నానంచేస్తున్నప్పుడులభించిన కొయ్యతోకూవిగ్రహాలు చేయవచ్చు. పదహారు ఆకులతో,పదహారు చక్రాలతో స్వామి రధాన్ని తయారుచేయాలి.అనేక రంగులతో,వస్త్రాలతో స్వామి రధాన్ని అలంకరించాలి.

పదునాల్గు చక్రాలతో బలరాముని రధాన్ని తయారు చేయాలి.పన్నెండు చక్రాలతో సుభద్ర రధాన్ని తయారు చేయాలి. బలరాముని రధాన్ని ఏడాకుల అరటితో చేసిన ధ్వజాన్ని ఏర్పాటుచేసి, దానిపై నాగలిని ధ్వజంగా ఉంచాలి. సుభద్ర రథంపై తామరకాడలతో చేసిన పతాకాన్ని ఉంచి, దానిపై పద్మాన్ని చిహ్నంగా ఏర్పాటు చేయాలి.బ్రాహ్మణులు మంత్రయుక్తంగా మూడు విగ్రహాలు రథాలపై ఉంచాలి. ఆషాడమాసం,శుక్లపక్షం ఏకాదశి రోజున రధయాత్రకు సిద్ధం చేయాలి. (10- 23)

ఎటువంటి అశుభాలు జరగకుండా చూడాలి. థంపై ఎవరు ఎక్కకుండా చూడాలి.మూడురోజుల తరువాత,ఉత్తర దిక్కున ఏర్పాటు చేసిన వేదికపై అంకురార్పణ చేయాలి.శాంతియుతంగా రథయాత్రకు అందరిని సిద్ధం చేయాలి,అవాంతరాలు జరిగితే శాంతి చేయాలి.మహావేది దగ్గరకు వెళ్లే మార్గాన్ని సిద్ధం చేయాలి.మార్గం రెండు పక్కల చక్కగా అలంకరించాలి. చందనం కలిపిన నీళ్లు చల్లాలి.గరుడ ధ్వజాన్ని ఏర్పాటు చేయాలి.గాయకులు,నర్తకులు,వాయిద్యాలు ఏనుగులు,గుఱ్ఱాలు సిద్ధం చేయాలి (24- 33)

ఈ విధంగా సంభారాలన్ని సిద్ధం చేసుకున్నాక రాజు శుచియై రథ యాత్రకు రావాలి. ఆషాడమాసం,శుక్లపక్షం,విదియ పుష్యమి నక్షత్రం ఉన్నప్పుడు రథ యాత్ర ప్రారంభించాలి.”జగన్నాధా!ఇంద్రద్యుమ్న మహారాజు రథయాత్ర ఏవిధంగా చేసాడో అదే విధంగారథయాత్ర చేయడానికి మేము వచ్చాము. నీవు ఈ రథంపై కాలు పెట్టి,గుడించా మండపం వరకు రథయాత్ర చేయ డానికి అనుమతించు”అని ప్రార్థించాలి.

కర్పూర పొడి చల్లిన పూవులను రథంపై చల్లాలి. బ్రాహ్మణులు శకున సూక్తాన్ని చదవాలి.స్వామి పుణ్య కీర్తనలను కొందరు కీర్తిస్తూ ఉంటారు.కొందరు బంగారు దండాలు ఊపుతూ ఉంటారు.ముత్యాల గొడుగులు పట్టుకొని స్వామి ఇరుపక్కలా నడుస్తున్నారు. స్వామిని భక్తితో పూజించి యాత్రకు సిద్ధం చేయాలి.

స్వామి రథయాత్ర చేయడానికి వస్తున్నసమయం లో దర్శించుకున్న వారికి వైకుంఠ ప్రాప్తి కలుగుతుంది. స్వామి రథయాత్ర చూడడానికి దేవతలు వస్తారు.రథ యాత్రను వర్ణించిన వారికి మూడు జన్మల పాపాలు నశిస్తాయి.రథముతో కూడా నడచు వారిని ఇంద్రాది దేవతలు అనుసరిస్తూ ఉంటారు.రథం నడిచేటప్పుడు ఎగిరే దూళి తగిలిన వారికి స్వర్గంలో గంగా నదిలో స్నానం చేసిన ఫలితం కలుగుతుంది.(34 - 66)

వేదపండితులు వేదాన్ని పఠిస్తున్నారు.పురాణాలు స్వామిని స్తుతిస్తున్నాయి.స్వామి ఎదుట జయజయ ధ్వానాలు చేసినవారు పాపవిముక్తులవుతారు.నాట్యము చేయువారు మోక్షాన్నిపొందుతారు.నామసంకీర్తన చేయువారికి పుణ్యం వెన్నంటి ఉంటుంది."జయ కృష్ణ జయకృష్ణ" అని కీర్తిసూ గుడించా వరకు వెళ్ళిన వారికి పునర్జన్మ ఉండదు.స్వామికి వింజామరలు వీచు వారికి స్వర్గంలో అప్సరసలు వింజామరలు వీస్తారు. బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది.శ్రీకృష్ణునిపై పూలు జల్లి న వారికి కోరికలన్ని తీరుతాయి.స్వామి తనను తాను మూడుగా విభజించుకొని రథంపై ఊరేగుతాడు. ఆసమయంలో దేవతలు,పితృ దేవతలు స్వామివెంట ఉరేగుతూ ఉంటారు.(67-80)

స్వామి పురుషోత్తమ క్షేత్రంలో ఏసమయంలో ఊరేగుతాడో అదే సమయంలో ఇతర ప్రదేశాలలో స్వామిని ఊరేగించాలి.ఇంద్రాది దేవతలు స్వామి రథ యాత్రలో ఇరువైపులా నిలబడి ఉంటారు.బ్రహ్మరథానికి ముందు నడుస్తూ ఉంటాడు.సర్వ పాపాలను హరించు నట్టి రథయాత్ర మరొకటి లేదు.

ఈ సమయంలో స్వామిని ఉద్దేశించి ఏమాత్రం దానంచెసినా మేరు పర్వతం అంతటి ఫలితం కలుగుతుంది.చిన్న మంచి పని చేసినా అనంతమైన పుణ్యం లభిస్తుంది.బ్రాహ్మణులకు దానం చేస్తే అక్షయమైన పుణ్యం కలుగుతుంది.స్వామి ముఖాన్ని చూస్తూ,రథం నుండి లేచు దుమ్ముమీద పడిన వాడు క్షణంలో ముక్తిని పొందుతారు. యాగాలు చేసి,తీర్థ యాత్రలు చేస్తే ఎటువంటి ఫలితం కలుగుతుందో అటువంతి ఫలితంరథయాత్రలో పాల్గొనడం వలన లభిస్తుంది.81-93.

ఈ విధంగా స్వామి మూడు రూపాలలో ఊరేగుచున్నరథాల కాంతి నాలుగు దిక్కులకి ప్రకాశిస్తోంది. స్వామి శరీరాన్నితాకివచ్చిగాలిమనపాపాలను పోగొడుతోంది.రథయాత్ర చూసిన వారికి స్వామిపై విశ్వాసం కలుగుతుంది.సహకరించిన వారికి సహజ ముక్తి కలుగుతుంది.

మధ్యాహ్న సమయంలో రథయాత్ర సాగు తున్నప్పుడు ఎండ వేడిమి తగ్గించడానికి రథంపై నీళ్లు చల్లాలి.చామరాలు వీస్తూ ఉండాలి. శ్రీకృష్ణునికి, బలరామునికి,సుభద్రకి, వివిధములైన పండ్లు, తీపి పదార్ధాలు,నైవేద్యంగా పెట్టాలి.స్వామిని శక్తికొలది పూజించిన వారికి సంసారంలోని బాధలు పోతాయి. బ్రహ్మ స్తుతించిన స్తోత్రాలతో స్వామిని స్తుతిస్తే బ్రహ్మలోకం లభిస్తుంది.మధ్యాహ్న సాయంకాల సమయంలో వేణువు,వీణ మొదలయిన వాయిద్యాలు మ్రో గించాలి.స్తుతి పాఠాలు చదువుతుండగా,చల్లని గాలి వీస్తుండగా,చక్కటి వాయిద్యాలు మోగుచుండగా స్వామి రథం ముందుకు సాగుతుంది.

సాయంకాల సమయంలో వేలకొలది దీపాలు వెలిగించాలి.రథాన్ని దూరంగా తీసుకు వెళ్లి, స్వామిని రథంనుండి దింపి,,అక్కడ ఉన్న వేదికమీద కూర్చోబెట్టాలి.గుడించ అను మండపంపై కూర్చున్న స్వామిని చూడడానికి అనేకమంది వస్తారు.చలువ రాతితొ చేయబడి, రత్న స్తంభాలతో ప్రకాశిస్తూ, నాలుగు వైపుల ద్వారాలు ఉన్న ఆ మండపంపై స్వామి దారు రూపంలో ఆవిర్భవించాడు.

స్కాంద పురాణంలోని వైష్ణవఖండంలోని పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యంలోని గుడించా యాత్ర అను ముప్పైమూడవ అధ్యాయం సమాప్తం

గ్రీసు దేశపు పురాణ గాథలు

వేమూరి వేంకటేశ్వరరావు

"**Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence.**"

Aldus Huxley. "Knowledge and Understanding"

ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, "మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి," అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా "ఇరవై నిమిషాల కార్యక్రమం" చూద్దామని వెతకడం ఉపక్రమించేను. "అపస్వరం అనే ఏపిల్ పండు కథ" ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.

పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, "చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను" అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.

ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

14. ప్రొమీథియస్ - మానవుల శ్రేయోభిలాషి

బొమ్మ. ప్రొమీథియస్ అగ్నిని మానవులకి బహుమానంగా ఇవ్వడం (వికీపీడియా)

ప్రొమీథియస్ (Prometheus) కథ ఈ ఆధునిక సాంకేతిక యుగానికి చాల పొంతన కల కథ. ఎందుకంటే మానవుల హితవు కోరి ప్రొమీథియస్ దేవలోకం నుండి అగ్నిని దొంగిలించి మానవులకి బహుమానంగా ఇచ్చేడు. నిప్పు లేకుండా ఉండి ఉంటే మనం ఇంకా అడవుల్లో చెట్ల మీద మన ముత్తాతలతో మనుగడ సాగిస్తూ ఉండేవాళ్ళం కదా! సాంకేతిక ప్రగతికి నిప్పుని మచ్చిక చేసుకోవడం మొదటి మెట్టు అని మన అందరికి తెలిసిన విషయమే!

ప్రొమీథియస్ (అనగా "ముందుచూపు" అని అర్థం) టైటనుల ప్రవరలో పుట్టిన వ్యక్తి. టైటను అయినప్పటికీ టైటనులకి ఒలింపియనులకి మధ్య జరిగిన మొదటి మహా సంగ్రామంలో ప్రొమీథియస్ ఒలింపియనుల పక్షం కాసి దేవతల రాజైన జూస్ గెలుపుకి సహాయపడ్డాడు. ఈ యుద్ధం లోనే జూస్ తన తండ్రి క్రోనస్ ని చంపి ఒలింపియనులకి అధిపతి అయేడు. అంతే కాదు. ఎథీనా జూస్ శిరస్సు చీల్చుకుని బయటకి వచ్చినప్పుడు ప్రొమిథీమియస్ దగ్గర ఉండి ఆ కార్యక్రమం సజావుగా జరగడానికి తోడ్పడ్డాడు. కనుక ప్రొమీథియస్ అంటే జూస్ కి అభిమానం ఉండాలి. మొదట్లో వీరిరువురి మధ్య సత్సంబంధాలే ఉండేవి. కానీ క్రమేపి మానవ సంతతి భూమి మీద పెరిగి వర్ధిల్లడం మొదలయే వేళకి ప్రొమీథియస్ మానవ పక్షపాతం చూపించి వారికీ సాంకేతిక విద్యలు నేర్పడం, వారికి అగ్నిని ఇవ్వడం వంటి ప్రాపక చర్యలు జూస్ కి నచ్చ

లేదు. స్వతహాగా జూస్ కి మనుష్యులు బలవంతులు అవడం అంటే ఇష్టం ఉండేది కాదు. ఈ కారణాల వల్ల ప్రొమీథియస్ కి తరచు జూస్ తో భేదాభిప్రాయాలు వచ్చి ఘర్షణ పడుతూ ఉండేవాడు.

ఇలా అంతర్గతంగా రగులుతూన్న కోపం ఒక్క సారి పెల్లుబికి పైకి రావడానికి కారణం ప్రొమీథియస్ చేసిన ఒక కొంటె పని. దేవతలు చేసిన ఒక యజ్ఞంలో ఒక మహిషాన్ని బలి ఇస్తారు. ఆ యజ్ఞఫలంగా ఆ ఎనుబోతు దుమ్ములని ఒక పెద్ద పళ్ళెంలో అమర్చి, వాటి మీద ఒక పొర కొవ్వుని పరచి, వాటి మీద పువ్వుల వంటి అలంకారాలు జతపరచేడు, ప్రొమీథియస్. వేరొక చిన్న పళ్ళెంలో ఆ ఎనుబోతు మాంసాన్ని వెగటు పుట్టించే పేగులతో కప్పి, రెండు పళ్ళేలని జూస్ ముందు ఉంచి ప్రథమ ప్రసాద భక్షకుడిగా ఒక పళ్ళెం ఎంచుకోమంటాడు, ప్రొమీథియస్. పైకి అందంగా కనిపిస్తూన్న పెద్ద పళ్ళేన్ని జూస్ ఎంచుకుంటాడు. ప్రొమీథియస్ రెండవ పళ్ళేన్ని పట్టుకెళ్లి ఆకలితో అలమటిస్తున్న మానవులకి ఇచ్చేస్తాడు. తనని మోసం చేసి తనకి బొమికలు ఉన్న పళ్లెం అంటగట్టడం మొదటి తప్పు. తనకి ఇష్టం లేని మానవులకి మంచి మాసం ఉన్న పళ్లెం ఇవ్వడం రెండవ

తప్పు. ఇలా రెండు విధాలుగా జూస్ అహం దెబ్బతింది కాబట్టి జూస్ ప్రొమీథియస్ మీద కక్ష కట్టేడు.

ఒకనాడు, ఒక సందర్భంలో జూస్ దేవతలందరికీ బహుమానాలు పంచిపెట్టేడు కానీ మానవులని పూర్తిగా విస్మరించేడు. అది ప్రొమీథియస్ కి నచ్చ లేదు. అందుకని రహస్యంగా ఒలింపస్ పర్వతం ఎక్కి, అక్కడ హెఫయెస్టస్ కర్మాగారంలో ఉన్న కొలిమిలో ఉన్న నిప్పుని దొంగిలించి, పట్టుకొచ్చి మానవులకి బహుమానంగా ఇచ్చేడు. ఈ విషయం అసలే కోపంగా ఉన్న జూస్ కి తెలిసింది. రాజుగారు తలుచుకుంటే కొరడా దెబ్బలకి కొదువా? కాకసస్ పర్వతాలలో ఒక రాతికి ప్రొమీథియస్ ని గొలుసులతో కట్టి అతనిని కాలం అంతరించే వరకు చిత్రవధ చెయ్యమని ఆజ్ఞాపించేడు, జూస్. ఎలా? ప్రొమీథియస్ కి చావు ఒకే సారి రాకుండా, పగటి పూట ఒక డేగ వచ్చి, అతని కాలేయాన్ని నెమ్మది నెమ్మదిగా పొడుచుకుని తింటూ ఉండాలి. ఆ కాలేయం రాత్రి పూట తిరిగి పుంజుకుని పెరుగుతూ ఉంటుంది. ఇలా ప్రతి రోజు సూర్య, చంద్ర, నక్షత్రాదులు ఉన్నంత కాలం బాధ అనుభవిస్తూ ఉండమని ఆజ్ఞాపించేడు (శపించాడు), జూస్.

మానవకోటి మనుగడకి, పురోభివృద్ధికి ముఖ్యంగా కావలసిన నిప్పుని దేవతల దగ్గర నుండి దొంగిలించి మానవులకి ఇచ్చినందుకు ప్రొమీథియస్ ఇలా యమయాతన అనుభవించేడు. తన శరీరాన్ని డేగ పొడుచుకుని తింటూ ఉంటే ఆ బాధకి అతను పెట్టే పెను బొబ్బలు గ్రీసులో ఉన్న ఒలింపస్ పర్వతం వరకు వినిపించేవిట. ఆ బొబ్బలు విని జూస్

ఆనందపడేవాడట. మరెవరైనా తనని ధిక్కరించి ప్రవర్తిస్తే వాళ్ళ గతి కూడా ఇలాగే ఉంటుందని హెచ్చ-రించేవాడుట.

మహా బలశాలి హెర్క్యులిస్ ఆ డేగని చంపి, ప్రొమీథియస్ కి విముక్తి కలిగించి ఉండకపోతే ఇప్పటికీ ఆ కాకసస్ పర్వతాలలో ప్రొమీథియస్ పెట్టే పెడ బొబ్బలు మనకి వినిపిస్తూ ఉండేవి!

ఎస్కిలస్ (Aeschylus, సా. శ. పూ. 523 - 456) అనే విషాదాంత నా-టకకర్త రాసిన విషాదాంత నాటకం "బందీ అయిన ప్రొమీథియస్" (Prometheus Bound), ప్రొమీథి-యస్ కథని చెబుతుంది.

పదిలమైన కాపురానికి పన్నెండు సూత్రాలు

సిహెచ్ . లక్ష్మీకుమారి

మానవనాగరికతలో వివాహవ్యవస్థ ఒక పెద్ద మలుపు. సమాజంలో వ్యక్తి శాశ్వతం కాదు కాబట్టి, సమాజం శాశ్వతంగా ఉండాలి కాబట్టి సమాజానికి ఉత్తమపౌరులను అందించాలనే సదుద్దేశంతో ఈ వివాహవ్యవస్థ ఏర్పాటైంది. ఇది సమాజంలో స్త్రీ పురుషులకొక గుర్తింపుని, గౌరవాన్ని ఇస్తుంది. అందుకే నాటి ఆటవికసమాజం మొదలుకొని నేటి ఆధునికసమాజం వరకు ఈ వివాహవ్యవస్థ

ఎంతో ప్రాధాన్యం పొందిది . కాని ఆధునిక నాగరికత పెరుగుతున్న కొద్దీ ఈ వివాహవ్యవస్థ బలహీనమౌతోంది. అసలు విలువ, గౌరవం లేకుండా పోతోంది. అందువల్ల దీన్ని బలోపేతం చెయ్యడానికి సదవగాహన ఎంతైనా అవసరం. ఇప్పుడు కొన్ని నియమాలు తెలుసుకుందాం

1. కుటుంబవ్యవస్థ పటిష్ఠంగా ఉండాలంటే భార్యాభర్తల మధ్య ఒక సదవగాహన చాల అవసరం. స్త్రీ తన కుటుంబ పరివారాన్ని , పుట్టి పెరిగిన పరిసరాల్ని విడిచిపెట్టి శాశ్వతంగా తన ఇంటికి వస్తోందని మగవాడు అనుకోవాలి. అలాగే తాను ఒక గౌరవ ప్రదమైన మరో ఇంట్లో అడుగు పెడుతున్నానని ఆ ఇంటి గౌరవం, మానమర్యాదలు తాను రక్షించాలని , తన గౌరవం కూడ దక్కించుకోవాలని స్త్రీ అనుకోవాలి.

2. దాంపత్యం అంటే ఒక సదవగాహన . అవసరమైతే ఒకరు మరొకరికోసం కొన్ని అలవాట్లను , అభిరుచులను వదులు కోవాలి . భర్త కోసం భార్య, భార్యకోసం భర్త తమ వ్యక్తి గత అభిరుచులను కొన్ని వదులుకుని అందరితో కలిసికట్టుగా ఉండడం నేర్చుకోవాలి. అలాగని తమ వ్యక్తిత్వాన్ని చంపుకొమ్మని కాదు. వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూనే కొన్ని అభిరుచులను త్యాగం చేయాలి .

3. స్త్రీ పురుషులు వారి కుంటుంబ గౌరవాన్ని గురించి గొప్పలు చెప్పుకోకూడదు. అలాగే ఎదుటి వారి కుటుంబాన్ని ఎన్నడు కించపరచ కూడదు.

4. వధువు అమ్మానాన్నలు గాని, వరుని అమ్మానాన్నలు గాని దంపతుల వైవాహికజీవితంలో ఎన్నడు జోక్యం కలగజేసుకోకాడదు. వారిని వారిగా ఉండనివ్వాలి అడిగినప్పుడే తమకు తోచిన మంచి సలహాలు చెప్పాలి. నేడు కాపురాలు నిట్ట నిలువుగా కుప్ప కూలి పోవాడానికి కారణం వీరి అనవసర ప్రమేయమే .

5. ఇంకో ముఖ్యమైన విషయమేంటంటే స్త్రీకి భర్త ఎంత ముఖ్యమో ఆయన కుటుంబ సభ్యులు కూడ అంతే ముఖ్యం . వారిని భర్తతో సమానంగానే గౌరవించాలి. అలాగే మగవాడు కూడ భార్యకిచ్చే గౌరవం ఆమె పరివారానికి కూడ ఇవ్వాలి .

6. స్త్రీపురుషు లిద్దరు సమానమని ఈ ప్రపంచం ఎంత మొత్తుకుంటున్నా శారీరకంగా స్త్రీకి కొన్ని పరిమితులున్నాయి ఉదాహరాణకి ఒక పురుషుడు తన ఆఫీసులో ఇంటి తాళాలు మరిచిపోతే ఆ పూటకి ఇంటి అరు-

గుమీద పడుక్కుని కాలక్షేపం చెయ్యగలడు. అదే పరిస్థితి స్త్రీకి ఎదురైతే ఆమె అలా చేయలేదు. ఆడదానికి కొన్ని పరిమితులు-న్నాయి . ఇవి ప్రకృతి విధించిన biological limitations . అం-దువలన ఆమె తన పరిమి-తులకు లోబడి నడుచుకోవాలి. తగుదునమ్మా అని మగాడిలా ప్రవర్తించకూడదు.

7. కుటుంబంలో దంపతుల మధ్య దాపరికం ఉం-డకూడదు . ఏ పనైనా చెప్పిచె-య్యడం, ఒప్పించి చెయ్యడం, లేదా చేసిన తరువాత చెప్పడం చాల అవసరం.

8. దాంపత్యం 63 లా ఉండాలి . మగాడు ఆరైతే స్త్రీ ఆరులో సగం మూడు . భార్య అర్థాంగి కాబట్టి ఆరులో సగం మూడు లాగానే ఉంటే దాంపత్యం 63 లా హాయినా , ఆనందంగా , ఒకరి-కొకరు అన్యోన్యంగా ఉంటారు. అంతే గాని ఆడది తగుదునమ్మ అని ముందుకొస్తే దంపతులు 36 లా ఎడమొహం పెడమొహం ఔతారు . ఆరు పెద్దది కనుక దాని గౌరవం దానికివ్వాలి . అంతేగాని నామాటే చెల్లాలని 3 ముందుకొ-స్తే 36 అవుతుంది. ఇది ప్రమాద కరం.

9. దంపతులెవరైనా తమకంటే వయస్సులో పెద్ద వారిని లేదా సమానమైన వారిని చిన్నవారిని కూడ ఏనాడు కిం-చపరచకూడదు. విభేదించ-వచ్చు కాని విరోధించకూడదు. ఇతరుల అభిప్రాయాన్ని అం-గీకారించపక పోవచ్చు. అంత మాత్రం చేత మీకేం తెలీదు . మీకంటే నేనెక్కువ చదువుకు-న్నాను అని గర్వంగా మాట్లాడకూ-డదు . చదువు వేరు అనుభవం వేరు. పది సంవత్సరాల చదువు లేదా జ్ఞానం ఐదు సంవత్సరాల్లో సంపాదించొచ్చు. కాని పది సం-వత్సరాల అనుభవానికి పదేళ్ళూ పడుతుంది. అందువల్ల మనకు-న్న మిడి మిడి జ్ఞానంతో పెద్దల్ని తక్కువ చెయ్యకూడదు. వారి అభిప్రాయం తప్పని త్రోసిపుచ్చ కూడదు. Your opinion is your opinion only. అనే పెద్దల మాటను ఎవరు, ఏనాడూ మర్చి-పోకూడదు. సామరస్యంతో అన్ని చర్చించుకోవాలి . మంచి చిన్న వారు చెప్పినా అంగీకరిం చాలి చెడు పెద్దవారు చెప్పినా తిరస్క రించాలి. నేడు కొత్త కాపురాలు కూలి పోడానికి కారణం అవగా-హన లేకుండా మూర్ఖత్వంతో ప్ర-వర్తించడమే .

10. ఒక ఇంటిలో కూతురే మరో ఇంటికొస్తే కోడలౌతుంది . అలాగే ఒక ఇంటిలో కొడుకే మరో ఇంటి అల్లుడౌతాడు . కాబట్టి తన కొడుకుని చూసినట్లు అల్లుణ్ణి; తన కూతుర్ని చూసినట్లు కోడల్ని చూడగలిగితే కుటుంబం స్వర్గ తుల్యం ఔ తుంది. అలాగే ఆడది తన తల్లి ని చూసినట్లు అత్తను , తండ్రిని చూసినట్లు మామను చూస్తే సమస్యలే ఉండవు .

11. భార్యాభర్తలు ఎట్టి పరి-స్థితిలోను మూడవ వ్యక్తి చొ-రబడకుండా తమ సమస్యలు తామే సామరస్యంతో పరిష్కరిం-చు కోవాలి . ఇద్దరు పరిష్కరిం చుకుంటే ఇంపు, మూడో వ్యక్తి చొరబడి తే కంపు .

12. ఆఖరిది అతిముఖ్య-మైనది ఒకటుంది. ఈ సృష్టిలో ఎవరి ప్రత్యేకత వారిదే . అందు-వల్ల మనల్ని మన స్థితిగతుల్ని ఎవరితోనూ పోల్చుకోకూడదు . మన ప్రత్యేకత మనది. పోలిక ప్రమాదం .

మరికొన్ని సూచనలు మరోసారి ....

సప్త మోక్ష నగరాలు

కొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పర-మావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయత్తమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపుఋషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్ధ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్ర-మాదరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైనప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహకరించాలని ఆశించడం సహజం. భగవంతుని అనుగ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగ-వంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తాడు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుం-డి విముక్తి చేయడానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు. వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప్త నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూతనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్షదాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప్త మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అందువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జయిని) మరియు ద్వారక.

సప్త మోక్ష నగరాలు - 6

ఉజ్జయిని

2. కాలభైరవ ఆలయం:

రైల్వే స్టేషన్ కు సుమారు 5 కిమీ దూరంలో ఉన్న ఈ ఆలయం అతి ప్రాచీనమైన ఆలయం. ఈ గుడి విషయంలో స్కాంద పురాణం, శివపురాణం పేర్కొంది. కాలభైరవ విగ్రహం నోటిలోనికి పాత్రతో మత్తు పానీయం (సారాయి) పోస్తే, ఆ పానీయం విగ్రహంలోకి పోతుంది. బ్రహ్మదేవుని అహంకారాన్ని అణచటానికి శివుడు కాలభైరవుడిని సృష్టించాడు. ఆయన భువి నుంచి దివి వరకూ వ్యాపించి, శివుని ఆనతిపై బ్రహ్మ శిరస్సులలో ఒకదానిని నరికివేశాడు. అందువల్ల అతనికి బ్రహ్మ హత్యా పాతకం అంటుకున్నది. దాని నివారణకు అన్ని పుణ్య క్షేత్రాలు, తీర్థాలు సందర్శించి, కాశీ వెళ్లగా అక్కడ బ్రహ్మ హత్యాపాతకం పోయింది. ఇదికాక కాలభైరవుడు కాశీ పట్టణానికి క్షేత్ర పాయాలకుడయ్యాడు.

సిద్ధివటం:

క్షిప్రా నది ఒడ్డున ఒక మర్రిచెట్టు ఉన్నది. ఈ చెట్టును భక్తులు అక్షయవటంగా పిలుచుకుంటారు. పార్వతీదేవి శివుని వేడుకుంటూ ఈ చెట్టు క్రిందనే తపస్సు చేసిందట. మొగలాయీలు ఈ చెట్టును నరికి, అది మరల పెరగకుండా ఇనుపరేకులు పెట్టారట. కానీ విచిత్రం - మర్రిచెట్టు ఆ రేకులను నెట్టివేసి పెరిగిందట. ఇక్కడ శ్రాద్ధ కర్మలు విధిగా జరుపుతుంటారు. కార్తికేయుడు తారకాసుర సంహారం అనంతరం రాక్షసుని సంహరించిన ఆయుధాన్ని క్షిప్రా నదిలోకి విసరివేశాడట.

4) సాందీపని ఆశ్రమం :

ప్రాచీన కాలంలో మనదేశంలో ప్రసిద్ధి చెందిన ఆశ్రమాలలో ఇది ఒకటి. ఇక్కడ సాందీపనుని శిష్యులుగా కృష్ణుడు, బలరాముడు, వారి స్నేహితుడు సుధాముడు విద్యనభ్యసించారు. ఇక్కడ వారి విగ్రహాలను తిలకించవచ్చు. కృష్ణుని జీవిత విశేషాలను తెలియజేసే చిత్రపటాలు ఇక్కడ ఒక

ప్రదర్శన శాలలో చూడవచ్చును. ఈ ఆశ్రమ ప్రాంగణంలో ఒక పెద్ద గోమతి కుండ్ ఉంది. ఈ కుండం లోని నీటినే ఆశ్రమవాసులు ఉపయోగించేవారట, ఇక్కడ ఉన్న శివాలయం ఒక ప్రత్యేక ఆకర్షణ, సామాన్యంగా అన్ని శివాలయాలలో కూర్చుని ఉన్న నందిని చూస్తాం. అందుకు భిన్నంగా ఇక్కడ నంది నిలబడి ఉంటుంది. ఇచ్చట ఆశ్రమంలో తరతమ భేదం లేకుండా అందరికీ విద్య లభించేది.

5) హరసిద్ధి దేవతా మందిరం:

హరసిద్ధి దేవత ఉజ్జయిని రాజయిన విక్రమాదిత్యుని ఆరాధ్యదేవత. ఈమె అనుగ్రహం వల్లనే విక్రమాదిత్యుని విశేషమయిన శక్తులు లభించాయట. ఇక్కడ విక్రమాదిత్యుని విగ్రహం కానవస్తుంది. ఇతడే బేతాళ కథల ద్వారా (బేతాళ పంచ వింశతి) కథలలోకి ఎక్కినా 'పట్టు వదలని' విక్రమార్కుడంటారు. ఇక్కడి పర్వత అరణ్య ప్రాంతంలో నివసిస్తున్న రాక్షసులను చండీదేవత శివుని అనుగ్రహంతో హతమార్చిందట. ఆమెను

పరమేశ్వరుడు 'నీవు హరసిద్ధి మాటగా ప్రసిద్ధి చెందుతావు' అని వరమిచ్చాడట. అందువల్ల ఈ దేవతకు 'హరసిద్ధిమాత' గా పేరు ఏర్పడిందంటారు.

6) మంగళనాథ్ దేవాలయం:

మంగళనాథ్ అంటే కుజుడు. ఇది ఒక చిన్న కొండ మీద ఉంది. 84 మెట్లు ఎక్కి ఆలయం జేరాలి. మత్స్య పురాణంలో ఈ ఈ ఆలయపురాణ వివరణ ఉన్నది. ఇక్కడ మహాభారత కాలం నుంచి ఖగో;ఆ శాస్త్ర పరిశోధన జరిగేవి. కుజదోషం ఉన్నవాళ్లు ఇక్కడ పూజలు చేస్తారు. ప్రతి మంగళవారం ఇక్కడ విశేష పూజలు చేయడం, అందులో భక్తులు పాల్గొనడం ఒక విశేషం.

7) భర్తృహరి గుహలు:

సుభాషిత కవిగా ఖ్యాతి గడించిన విక్రమాదిత్యుని అన్నగారైన భర్తృహరి ఇక్కడివాడే. ఆయన పేరిట గుహలు ఉజ్జయినికి సుమారు 7 కిమీ దూరంలో ఉన్నాయి. కొంతకాలం రాజుగా రాజ్యాన్ని పరిపాలించి, ఆ తర్వాత వైరాగ్యంతో రాజ్యాధికారాన్ని వదులుకుని ఈ గుహలలో అతడు తపస్సు చేశాడట. ఈ గుహలు 11 వ శతాబ్దం నాటివని చరిత్రకారులు చెబుతారు.

8) బడే గణేష్ దేవాలయం:

మహాకాళేశ్వర ఆలయానికి అతి చేరువలో బడా గణేశ దేవాలయం ఉన్నది. ఇక్కడ గణపతి విగ్రహం చాలా పెద్దది. అందంగా ఉంటుంది. ఈ మందిరమందు పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని కూడా దర్శించవచ్చును.

9) గోపాల మందిరం:

ఇచ్చట ఉజ్జయినీ పుణ్యస్థలి నడిబొడ్డున గోపాలమందిరం అలరారుతోంది. ఇక్కడ ద్వారకాధీశుడు, గోపాలుడు, గోవిందుడు ఐన కృష్ణ భగవానుని వెండి విగ్రహాన్ని నెలకొల్పారు. గర్భగుడి ద్వారాలు వెండిరేకుతో మనోహరంగా తీర్చిదిద్దారు. ఆలయాన్ని 1833 లో సింధియా మహారాణి బైజాబాయి నిర్మించారు. కృష్ణుడి జన్మాష్టమి వేడుకలు ఈ ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం అలవాటు.

10) త్రివేణి సంగమం:

ఉజ్జయిని పుణ్యస్థలిలో క్షిప్రానది పారుతూ, భక్తులను పునీతులను చేస్తుంది. ఈ నది సహజంగా గిరులనుంచి, ఝురులనుంచీ కాక భూగర్భం నుంచి ఉద్భవించింది. ఉజ్జయినిలో త్రివేణి సంగమం జరుగుతుంది. ఇక్కడ క్షిప్ర, కన్, సరస్వతి నదులు కలుస్తాయి.

ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి బృహస్పతి సింహరాశిలో ప్రవేశించినప్పుడు ఇచ్చట కుంభమేళా అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఈ మేళాని స్థానికులు సింహస్థ అని పిలుస్తారు. కోట్ల సంఖ్యలో యాత్రికులు ఈ కుంభమేళాలో పాల్గొంటారు. సాధువులు, సన్యాసులు, దిగంబర నాగసా-

ధువులు అధిక సంఖ్యలో పాల్గొనటం విశేషం. మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చక్కటి ఏర్పాట్లు చేస్తుంది. గత కుంభమేళా ఉత్సవము ఏప్రిల్ 22, 2016 సం ||లో జరిగింది.

క్షిప్రానది ఉద్భవానికి ఒక కథ ప్రచారంలో ఉంది. పూర్వం లయకారుడైన శివుడు తీవ్ర ఆకలికి లోనయ్యాడు. ఆయనకు ఎన్ని రోజులు గడిచినా ఆహారం లభించలేదు. చివరికి ఆ నీలకంఠుడు శ్రీమన్నారాయణుని చెంతకేగి ఆహారం ప్రసాదించమని అర్థిస్తాడు. అయితే విష్ణువు ఈ అభ్యర్థనను పట్టించుకోకుండా తన చూపుడువేలు పైకి ఎత్తుతాడు. కోపించిన శివుడు చూడు వేలిని తన త్రిశూలంతో ఖండించివేయగా విష్ణుమూర్తి వేలినుంచి కారిన రక్తమే క్షిప్రానదిగా మారిందని కథనం.

స్థానికులు క్షిప్రా నది ఆవిర్భావం గురించి మరో కథ కూడా ముచ్చటించుకుంటారు. అత్రి మహాముని మూడువేల సంవత్సరాలు ఘోర తపస్సు చేయగా అతని నుండి రెండు కాంతిపుంజాలు వెలువడ్డాయి. ఒక కాంతిపుంజం ఆకాశం వైపుకి వెళ్లి చంద్రునిగా మారిందట, మరో కాంతిపుంజం భూమిలోకి ప్రవేశించి, పాతాళగంగగా క్షిప్రానది పేరుతో ఉజ్జయినిలో ప్రవహిస్తున్నది. ఈ నదికి మరో పేరు సామావతి. ఈ నది ప్రధాన నదులు పారే విధానానికి మారుగా ఉత్తరం వైపు ప్రవహిస్తుంది. 2004 సం|| నికి ముందు ఉజ్జయినీ కుంభమేళాను దృష్టిలో ఉంచుకుని, నీరు నిరంతరం పారేలాగా వేరే నదులతో సంధానం చేసి, కాలుష్యరహితంగా క్షిప్రానదిని తీర్చిదిద్దారు.

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలలో సప్తమోక్ష తీర్థాలలో ఉజ్జయిని క్షిప్రానది, గంగ, సరస్వతి, గోదావరితో నిర్వహించబడే నాలుగోది. కుంభమేళాలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే సమస్త పాపాలు నశించి

పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

11) రామాలయం:

ఉజ్జయినీ రైల్వే స్టేషన్ కి సుమారు 2 కిమీ దూరంలో రామాలయం ఉంది. క్షిప్రానది ఒడ్డున ఈ ఆలయం ఉండటం వలన ప్రశాంతమయిన వాతావరణంలో స్వామిని దర్శించుకునేందుకు వీలవుతుంది.

12) ఎన్నో దర్శనీయాలు:

ఇంకా ఈ పుణ్యక్షేత్రమందు చూడవలసిన అనేక దేవాలయాలు ఉన్నాయి. చార్ ధామ్, ప్రశాంతి ధామ్, జంతర్ మంతర్ లను చూడవచ్చు. చార్ ధామ్ ఆలయం రామాలయానికి చేరువలో ఉన్నది. ప్రశాంతి ధామ్ లో షిరిడీ సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇదే ఆలయంలో వేంకటేశ్వరస్వామి విగ్రహం, శివుడు, రాముడు, హనుమాన్ మూర్తులు అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

1730 లో జైసింగ్ నిర్మించిన జంతర్ మంతర్ కూడా ఉజ్జయినిలో చూడవలసిన ప్రదేశాలలో ఒకటి. ఇది ఖగోళ శాస్త్రానికి సంబంధించిన పరిశోధన, పర్యవేక్షణ కట్టడం. సూర్య చంద్ర గరహనాలు సంభవించే రోజులను సమయాన్ని ఇక్కడ ఖచ్చితంగా తెలుసుకోగలం.

ఓంకారేశ్వర జ్యోతిర్లింగం:

ఉజ్జయినీ పుణ్యక్షేత్రంలోని జ్యోతిర్లింగాన్ని దర్శించుటకు వచ్చిన యాత్రికులు చాలామంది ఓంకారేశ్వర జ్యోతిర్లింగాన్ని దర్శించుటకు ఉజ్జయిని నుండి బస్సులో ప్రయాణించి నర్మదా నది తీరాన ఉన్న శైవ క్షేత్రానికి వెళ్లి భక్తిప్రపత్తులతో ఆరాధించుకోవడం ఒక అలవాటు.

ఈ క్షేత్రంలో నర్మదానది నర్మద, కావేరి అను రెండు పాయలుగా ప్రవహిస్తుంది. ఆ పాయల మధ్య ఉన్న ప్రదేశమే మందా తృపిరి. సూర్యవంశ రాజు అయినా మంధాత ఇచ్చట పర్వతంపై చాలా సంవత్సరాలు తపస్సు కావించి శివుని ప్రసన్నం చేసుకున్నాడు. మాంధాత స్వామికి దేవాలయం కట్టించాడు. ఆకాశమార్గాన విహంగ వీక్షణ చేస్తే ఇచ్చటి దేవాలయాలు ఓంకారరూపంలో కనిపిస్తాయి. అందుచేత ఓంకారేశ్వరుడని పిలవబడుతూ భక్తుల అభీష్టాలను నెరవేరుస్తున్నాడు.

నర్మదానది ఆవలి వైపున మమలేశ్వర దేవాలయాన్ని కూడా జ్యోతిర్లింగ ధామం అని అంటున్నారు. ఇక్కడి ఆలయం పురాతనమైనది. చిన్న శివలింగం. అందరూ రెండు లింగాలను స్పృశించవచ్చును. ఈ పుణ్యక్షేత్ర దర్శనం పూర్వజన్మ పుణ్యఫలం.

నూటపదహార్లు కందాల్లో
సుందరకాండ

పాలెపు బుచ్చిరాజు

మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అద్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు "నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ"ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం.ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని 'వంద కందాల్లో సుందర కాండ' రాద్దామనే ప్రయత్నం చేశాను. 'అష్టోత్తర శతం' దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి 'నూటపదహార్లు' తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా "పురజన గీత" గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశంచి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి 'పురజన గీత' అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

89) చూచిన వెంటనె యడుగును
చూచితివా సీతనంచు చూడామణినిన్
చూచిన నమ్మును రాముడు
చూచితినను దీనినిచ్చు చుంటిని హనుమా!

81. నిన్ను చూడగానే రాముడు ఎదురుగా వచ్చి, 'చూశావా సీతను?' అని అడుగుతాడు. చూశానని నువ్వు చెప్పగానే నమ్మడానికి ఈ చూడామణి ఇస్తున్నాను. తీసికొని వెళ్ళు." అని తన బాధనంతా చెప్పింది.

90) పోయెద తల్లీ తప్పక
పోయెద భయమేల నీకు భూమిజ యంచున్
కాయము బెంచెను మారుతి
పోయెను నింగికెగురుచును పూనిక తోడన్

82. "సరే! తల్లీ!! నీ కోరిక ప్రకారమే చేస్తాను. నీ సందేశాన్ని రాముడికి విన్నవిస్తాను." అని తన శరీరాన్ని పెద్దగా చేసి ఆకాశంలోకి ఎగిరాడు.

91) వచ్చితి నట్టులె బోనేల
కచ్చెకు తప్పక దిగవలె గావున చూతున్
అచ్చట ముచ్చట దీరగ
మచ్చుకు రావణు బలమని మారుతి తలచెన్

83. ఇంతలో ఆయనకొక ఆలోచన వచ్చింది. ఎలాగూ వచ్చాను కదా, ఊరికే తిరిగి పోవడం ఎందుకు? యుద్ధానికి ఎలాగూ రావాలి. కనుక వీళ్ళ బలాబలాలు తెలుసుకుంటే మంచిది అనిపించింది.

92) అద్దరి నశోకవనమున
పెద్దగ శబ్దంబు చేసి పెటిలుమని దిగెన్
గుద్దుచు నాశము చేసెను
మద్దుల పలు భూరుహముల మానులు పీకెన్

84. అశోకవనంలో సీత ఉన్న ప్రదేశానికి దూరంగా, ఒక చోట దబ్బున దుమికాడు. అక్కడున్న మది చెట్లను మానులతో సహా పీకి పారేయసాగాడు.

93) కపి చేష్టల కబ్బురపడి
రిపుడంపిన సేనలందరిని చంపంగా
కపియా యముడా పట్టుడు
అపుడే యని జంబుమాలి కానతి యిచ్చెన్

93. ఎవడో కోతి వనమంతా చెరిచాడని విని, “ఆ(! కోతే కదా” అని వాడిని పట్టుకోమని కొంత సైన్యాన్ని పంపాడు రావణుడు. ఆ సైన్యాన్ని వాడు క్షణాల్లో మట్టుపెట్టాడని తెలియగానే, కోపంతో, “వాడేమైనా యముడా ఏం? బంధించి తీసుకురా!” అని జంబుమాలి అనే వీరుడిని పంపాడు.

94) చచ్చెను యసురుడు చచ్చెను
వచ్చిన యక్షకుమరుండు వరుసగ యనిలో
ఎచ్చటి వాడీ కపియని
అచ్చెరువడినింద్రజిత్తు నంపెను కడకున్

94. యుద్ధంలో జంబుమాలి, తరవాత వచ్చిన అక్షకుమారుడు కూడా చచ్చారని తెలిసింది రావణుడుకి. అప్పటికి అర్థం అయింది దశకంఠుడికి వచ్చిన వాడు సామాన్యుడు కాదని. గత్యంతరం లేక, ఇంద్రజిత్తుని పిలిచి ఎలాగైనా మాయ చేసి వాడిని బంధించి తెమ్మని ఆజ్ఞాపించాడు.

95) రక్కసి సేనల వేలలొ
నుక్కడ గించెను వదలక నొక్కడె కడకున్
రక్కసు బ్రహ్మాస్త్రమునకు
మొక్కెను మారుతి నయముగ ముగియించె ననిన్

95. హనుమంతుడికి ఇంద్రజిత్తుకీ మధ్య భయంకరమైన పోరాటం జరిగింది. తన మాయోపాయాలు సాగక పోగా, ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం వేశాడు. దానికి భక్తితో నమస్కరించి యుద్ధం ఆపుచేశాడు హనుమ.

96) పట్టిరి తెచ్చిరి సభలో
పెట్టిరి రావణు డడుగగ పెద్దగ చెప్పెన్
పెట్టెద శ్రాద్ధము నీకని
పుట్టిన కోతిగ దశరథ పుత్రుని దూతన్

96. అదే ఆదనని, హనుమను బంధించి, రావణుడి సభలో నిలబెట్టారు రాక్షసులు. రావణుడు కోపంతో, “ఎవడవు నువ్వు? ఎందుకు వచ్చావు?” అని అడిగాడు. హనుమంతుడు, ధైర్యంగా “ నాది కోతి పుట్టుక అయినా, వీరాధివీరుడు రాముని బంటును. నీ అంతు చూడడానికి వచ్చాను.” అని సమాధానం చెప్పాడు.

ఏక్ భారత్ ` శ్రేష్ట భారత్ సాధనలో విద్యా విధానం యొక్క పాత్ర

ఆచార్య మత్స్యరాజ హరగోపాల్

(గత సంచిక తరువాయి)

నేను ఆఫ్రికా, ఏషియాలోని కొన్ని కామన్‌వెల్త్ దేశాల్లో Common Wealth Countries విద్యాబోధన చేసినపుడు అంతర్జాతీయంగా ఒకే పాఠ్యప్రణాళిక కల్గిన Cambridge University Overseas Education and Examiniations Syndicate- పరీక్షా విధానంవల్ల విద్యార్థుల ప్రతిభను పరీక్షించి సర్టిఫికేట్స్ ఇవ్వడం జరిగింది. ఈ విద్యావిధానంలో Cambridge 'A' level మరియు 'O' level) ప్రాక్టికల్‌గా ఆలోచించే విధానానికి ప్రోత్సాహమివ్వడం జరిగింది. అదేవిధంగా జెనీవా కేంద్రంగా గల IB (International Baccalaureate) విద్యావిధానంలో విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు గణితము, మ్యూజిక్, చరిత్ర మొదలుగునవి. ఒక ఆర్టన్, సైన్స్, భాష సబ్జెక్టుల్లో దేనినైనా ఎంపిక చేసుకునే విధానమున్నది. నేను 'A Comparitive Study of preparatory Courses to the University Education with Special reference to India in International Perspective' అనే అంశంపై పరిశోధన కూడా చేయడం జరిగింది.

అయితే ప్రస్తుతం NEP2020 (జాతీయ విద్యావిధానంలో) ఈ అంశాలను నేను చూడడం జరిగింది. కాబట్టి NEP2020 విద్యావిధానం మన విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైనదిగా నేను భావిస్తున్నాను.

ఇంకో ముఖ్యవిషయం ` మన దేశ, సంస్కృతీ సాహిత్యాలు, పూర్వవైభవం పాఠ్యప్రణాళికలో భాగం కావడం, సంస్కృత భాషకు ప్రాధాన్యతనివ్వడం జరిగింది. గణిత, వైజ్ఞానిక రంగాలలో మన పూర్వులు సాధించిన విజయాలపై, పరిశోధన, జరగడానికి సంస్కృత భాషను ఇటీవల మన దేశంలోని కొన్ని ఐ.ఐ.టి, ఐ.ఐ.ఎమ్‌లలో ఇంజనీరింగ్, సైన్స్ విభాగాలకు అనుసంధానం చేశారు. ఇవి అద్భుతమైన ఫలితాలనిస్తుందనటంలో సందేహం లేదు. ఇటీవల కాలంలో పాశ్చాత్య శాస్త్రవేత్తలు మన పూర్వులు సాధించిన, కనుగొన్నవాటిని సమర్థించారు. ఉదాహరణకు 'రామసేతు'ను 'నాసా' శాస్త్రవేత్తలు నిజమని చెప్పే దాకా మనం నమ్మలేదు. కొందరైతే వాటిని పుక్కిటి పురాణాలని హేళన చేశారు కూడా. 'నాసా' శాస్త్రజ్ఞులు పరిశోధన తర్వాత వీరికి జ్ఞానోదయమైంది. కావున, మన పూర్వ శాస్త్ర విజ్ఞానాన్ని, వాఙ్మయాన్ని తరచిచూసి, పరిశోధన చేయాల్సిన అవసరమెంతో ఉంది. అందుకు సంస్కృతంలో కనీస ప్రావీణ్యత అవసరం. ఇది NEP 2020 లో గుర్తింపబడడం ముదావహం.

అలాగే 'గురుకుల' విద్యాలయాల్లో కూడా అంతర్జాతీయ

విధానంలో బోధన జరగాలి. ప్రాథమిక స్థాయిలో తప్పకుండా 'మాతృభాష'లోనే బోధనతోపాటు స్థానికంగా లభించే వస్తువులలో Locally Available Material- ద్వారా ప్రాక్టికల్‌గా గణితం, విజ్ఞానాన్ని బోధించాలి, Abacus లాంటివి. NEP2020 విధానంలో దేశ వ్యాప్తంగా 15వేలకు పైగా పాఠశాలల్లో క్వాలిటీ పరంగా వృద్ధి సాధించాలనే ఉద్దేశ్యంతో 2021 బడ్జెట్‌లో నిధులు కేటాయించడం జరిగింది. 100 కొత్త సైనిక స్కూళ్ళ ఏర్పాటు, లేహ్ (లడాక్) లో కేంద్రీయ విశ్వవిద్యాలయ ఏర్పాటు, 'అందరికీవిద్య సమానవకాశాలు' అనే మహోన్నత ఆశయాలతో బడ్జెట్‌లో విద్యావకాశం కొరకు 99,300 కోట్లు కేటాయించడం జరిగింది. జాతీయ స్థాయిలో NCERT, రాష్ట్ర స్థాయిలో SCERT సంస్థల ద్వారా 'విద్య` పరిశోధన` శిక్షణ' రంగాల్లో మార్పులు చేస్తూ సమాజానికి, జాతీయ శ్రేయస్సుకై 'విద్య' ఉపయోగపడాలని ఉద్దేశ్యం. 'విద్య' కేవలం 'ఉపాధి' కొరకు మాత్రమే కాకుండా విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి కొరకు, పరిపూర్ణ మానవునిగా తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో, ఆశయాలతో విద్యావిధానం తేబడిరది. 'పాఠశాల' అనేది కేవలం పిల్లలు జ్ఞానం మెలకువలను మాత్రమే సంపాదించుకునే స్థలం కాదని, విద్యార్థుల, ఉపాధ్యాయులు సామాజికంగా, బహుముఖ సాంస్కృతిక జీవితం వికసించే స్థలమని గ్రహించాలి. NEEP2020 పాఠశాల అధ్యాపకులకు (Teachers) కొన్ని లక్ష్యాలకు నిర్దేశించింది. అవి ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించడం, నేర్చుకోవడంతో శక్తిని, ఉత్సాహాన్ని పెంచడం, తాము చేసే ప్రతి పనిలో శ్రద్ధాసక్తులు కనబరచి విద్యార్థులనుత్తేజపరచి కార్యోన్ముఖుల్ని గావించడం, గ్రహణశక్తి, ఆలోచనలు ఉంటాయి. కాల్పనిక శక్తులకు పునాది వేయడం, విద్యార్థులు అంతర్గత ప్రతిభను వెలికితీయడం, వారు సత్ప్రవర్తన కల్గి మంచి పౌరుడుగా ఎదగడం, వారి ఆలోచనలను, భావాలను స్పష్టంగా, నిర్దిష్టంగా, ధారాళంగా తెలియజేయడానికి మాతృభాషలో స్ఫూర్తిని, శిక్షణ నివ్వడం అనేవి ప్రతి ఉపాధ్యాయుడికి అధ్యయనం (Study) అధ్యాపనం (బోధన) ఊపిరిగా ఉండాలి. ఈ ఉద్దేశ్యాలతోనే నేను పనిచేసిన రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా విభాగంలో (ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం) ERTW (Educational Reaserch and Training Wing) అధిపతిగా అప్పటి A.P. రాష్ట్ర స్థాయిలో నిష్ణాతులలో పాఠ్య ప్రణాళిక సిద్ధం చేయించడం, విద్యారంగంలో పరిశోధన చేయడం, అధ్యాపకులకు శిక్షణాతరగతులను ఏర్పాటు చేయించడం ద్వారా వారికి అండగా నిలిచాం. అందుకుగాను జాతీయ స్థాయిలో COBSE (Council of Boards of Secondary Education) నిర్వహించే సమావేశాల్లో బోర్డ్ ప్రతినిధిగా పాల్గొని, ఆయా రాష్ట్రాల్లోని పాఠశాల విద్యా సంచాలకులతో CBSE అధికారులతో చర్చలు జరిపి 'జాతికి అవసరమైన విద్య' అందించడంలో కృషిచేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో పాఠశాల విద్యారంగం (School Education) లోని పాఠ్య ప్రణాళిక, కరిక్యులర్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ విభాగాల్లో మార్పులు, చేర్పులు చేయడం జరిగింది. ప్రస్తుతం ఇవి NEP20 లో కన్పించడం సంతోషకరమైన విషయం.

విద్యా దదాతి వినయం
వినయాద్యాతి పాత్రతామ్
పాత్రాత్ ధనమాప్నోతి
దానద్ధర్మమ్ తతః సుఖమ్

అన్నట్లుగా 'విద్య' వినయాన్ని ప్రసాదించాలి. తద్వారా సమాజంలో గౌరవం, ధనప్రాప్తి, విద్యాదానం ద్వారా అధ్యాపకుడు సుఖం అనుభవించాలి. 'గురు' శబ్దానికి సార్థకత కల్గించాలి. భారతీయ సంస్కృతిలో 'గురువు స్థానం మహోన్నతమైంది. ఆ స్థానానికి ఇచ్చే గౌరవం పాలకులు ఇవ్వాలి. అందుకు తగిన విధంగా అధ్యాపకులు తమ కర్తవ్యాన్ని, ధర్మాన్ని నిర్వహించాలి. 'విద్యార్థులను' బాధ్యాతాయుతమైన దేశభక్తులుగా, పౌరులుగా తీర్చిదిద్దాలి. వారు తమ స్వశక్తితో 'జీవన పర్యంతం' అభివృద్ధి పథంలో పయనించి దేశ సౌభాగ్యానికి తోడ్పడాలి.

సాధారణంగా మూడేళ్లు నిండిన పిల్లలకు నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి పేరుతో శిశు విద్య తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తుంటారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 15 లక్షలమంది చిన్నారులున్నా దాదాపు 10 లక్షలు శిశు తరగతుల్లో చేరుతున్నట్లు అంచనా. శిశుతరగతుల్లో ఆటలు, పాటలు, కథలు, మాట్లాడిరచడం, కలరింగ్, అంకెలు నేర్పడం, రకరకాల జంతువులు, పక్షులు, కూరగాయలు, పండ్లలాంటి నిత్యం మనం చూసే వాటిని గుర్తించడం నేర్పుతారు. చిన్న చిన్న పనుల ద్వారా, స్థానికంగా లభించే వస్తువుల ద్వారా నేర్చుకునే తత్వాన్ని అలవరచుకుంటారు. తమ తోటి పిల్లల 'అనుకరణ' ద్వారా కూడా కొత్త విషయాలను తెలుసుకుంటారు. అందుకే 'తల్లిదండ్రులు కొన్ని పిల్లల పుస్తకాలు చార్టులు (Charts) ద్వారా తమ పిల్లలకు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో శ్రద్ధ వహించాలి. ఇంట్లో మొక్కలు నాటించడం, బొమ్మలు గీయడం, చిన్న చిన్న వస్తువులను తయారుచేయించడం, వారికి కలిగే చిన్న సందేహాలకు ప్రశ్నలకు, వారి చిట్టి బుర్రలకు అర్థమయ్యే విధంగా జవాబులు చెప్పాలి. పిల్లలతో వీలైనంత ఎక్కువ సమయాన్ని గడిపి వారికి మనోధైర్యాన్ని, స్థైర్యాన్ని కల్గించాలి. అందుకే 'తల్లి ప్రథమ గురువు' అని భారతీయ ధర్మం ఘోషిస్తుంది. 'మొక్కైవంగనిది మ్రానైవంగునా' అన్నట్లుగా శిశు ప్రాయంలో తల్లిదండ్రుల ప్రభావం చిన్నారులపై ఉండడంవల్ల, వారి భావి జీవితాలను ప్రభావితం చేస్తుంది. అందుకే 'శిశువిద్య' ప్రాముఖ్యతను NEP2020 లో పొందుపరచడం జరిగింది. ఇది అతి ముఖ్యమైన విషయం. అందుకు మనమందరం సహకరించ వలసిన అవసరం ఎంతైనా ఉంది.

4. ఉన్నత విద్యలో మార్పులు

ఉన్నత విద్యకు సంబంధించిన 117, పాఠశాల విద్యకు సంబంధించిన 150 సూచనలు మెల్లిమెల్లగా ఆచరణలోకి తీసుకు

రాబడుతాయి. ఇంతకు పూర్వం ఆచరణలోనున్న విద్యాహక్కు చట్టంలోని లొసుగులను తొలగించిన ఈ చట్టం, వచ్చే విద్యాసంవత్సరంలో ఆచరణలోకి తెస్తున్నట్లు కేంద్ర విద్యామంత్రి ప్రకటించారు. ఇందుకుగాను పాఠ్యప్రణాళికలో భారతీయతకు, జాతీయతకు, జీవన నైపుణ్యాలు, దేశసమగ్రత, భారతీయ విలువలతో కూడిన సమగ్ర స్వరూపం చేర్చబడినాయి. అందరికీ సమానంగా విద్యావకాశాలు, సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడినవారికి కూడా లభిస్తాయి.

ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యాసంస్థలైన IIT, IIM, IISC లలో కూడా సైన్సు, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్‌లతోపాటు ఆర్ట్స్, హ్యూమానిటీస్ సబ్జెక్ట్‌స్‌ను బోధించి, 'Multi Disciplinary System' రావాలనేది లక్ష్యం.

ఇటివలి 2017లో ఢిల్లీలో కంప్యూటర్స్ సైన్స్ G సాంఘికశాస్త్రం మిశ్రమంతో బి.టెక్ కోర్స్ చేర్చి, సాంఘికశాస్త్రవేత్తలకు కూడా కంప్యూటర్ విజ్ఞానంలో కూడా ఉన్నత పరిజ్ఞానం కల్గించేట్టు పరిశోధన రంగంలో కూడా ఉపయోగపడేట్లు చేయబడిరది. ఇలాంటి విధానం అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ రావాల్సిన అవసరమున్నది.

డిగ్రీ 3`4 సంవత్సరకాలంలో విద్యార్థి పూర్తి చేస్తాడు. ఏదైనా కారణాలవల్ల మధ్యలో 1`2 సంవత్సరాల తర్వాత ముందుకు సాగని పక్షంలో, చదివిన విద్యాసంవత్సరం వృథా కాని విధంగా ఒక సంవత్సరం తర్వాత సర్టిఫికేట్, రెండు సంవత్సరాల తర్వాత 'డిప్లమా' ఇవ్వబడుతుంది. అంతేకాక తర్వాత కాలంలో 'డిగ్రీ కోర్సు'Degree Course) పూర్తిచేసే అవకాశం లభిస్తుంది. 'అకాడమిక్ బ్యాంక్' Academic Bank- Digital ఏర్పాటు ద్వారా వివిధ ఉన్నత విద్యాసంస్థల నుండి 'క్రెడిట్' పొందగలగడం, వృత్తి విద్యాకోర్సుల్లోనూ పెను మార్పులు అనేవి ఈ విధానంలో (NEEP 2020) లో ముఖ్యాంశాలు.` విద్యాసంస్థలు డబ్బు సంపాదనే ధ్యేయంగా ఉన్న ఇటీవలి కాలంలో ఈ నూతన విద్యావిధానం, విద్యారులకు, తల్లిదండ్రులకు, పౌరులకు రక్షణ కల్పించే విధంగా, ఇష్టారీతిగా ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీసులను పెంచడాన్ని నిరసిస్తూ, అందుకు నిరోధిస్తూ విధానాల రూపకల్పన చేస్తుంది.

ఈ విద్యా సంవత్సరం (2021`22) నుండి, 8 ప్రాంతీయ భాషలలోను (తెలుగు మాధ్యమంతో సహా) ఇంజనీరింగ్ విద్యను అందించి బోధించడానికి అఖిల భారత సాంకేతిక మండలి (ఏ.ఐ.సి.టి.ఈ) ఇటీవల ఉత్తర్వులు జారీచేయడం సంతోషకరమైన విషయం.

5. శీలముతో కూడిన విద్య

శీలేన శోభతే విద్యా అనేది ఒక సంస్కృత సుభాషితం. ఈ పదం ఇటీవలి కాలం దాక కొన్ని విద్యాసంస్థలలో గోడలపైన కనపడుతూ ఉండేది. ఇందులో శీలం, శోభ, విద్య అనే మూడు పదాలు వున్నాయి. శీలం అంటే స్వభావం అని అర్థం. అనగా సహజ లక్షణం. ఎలాంటి పరిస్థితులలోను మార్పు చెందని గుణం అని భావించాలి. ఉదాహరణకు నిప్పుకు మండటం ఎలా సహజ గుణమో శీలం కూడా అలాంటిదే. ఇక రెండవది శోభ. అంటే ప్రకాశం. చీకట్లను తొలగించడానికి ఉపకరించేది అని అర్థం. మూడవది అయిన విద్య అనే పదాన్ని ఇప్పుడు మనం సాధారణ

అర్థంలో చదువు అంటున్నాము. ఇది "విద జ్ఞానే" అనే ధాతువు నుండి పుట్టింది. విద్ అంటే ఎరుగుట, గ్రహించుట అని అర్థం. అనగా చదువు శీలంతో శోభిస్తుంది అని ఈ సుభాషితాని-కి అర్థం.

చదువు మనిషిలోని నడవడి-లో మార్పు తీసుకురావాలి. అదే సంస్కారం. సమాజం కూడా విద్యావంతులైన వారినే గౌర-విస్తుంది. అందుకే హిరణ్య కశిపుడు కూడా తన కుమారు-నితో "చదువని వాడు అజ్ఞుండగు చదివిన సదసద్వివేక చతురత కలుగున్" అంటాడు. భర్తృహ-రి కూడా చదువే ఒక శాశ్వతమైన సంపద అంటూ చదువు వలన కలిగే అనేక ప్రయోజనాలను వి-వరిస్తాడు.

శ్లో॥ విద్యానామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం,
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురు:।
విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరాదేవతా,
విద్యా రాజసు పూజ్యతే నహి ధనం విద్యా విహీనః పశు: ॥

కాని ఇక్కడ ఒక విషయం గమ-నించాలి. ప్రాచీన భారతీయ వి-ద్యావిధానంలో చదువు వలన మానవుడు అనేక ప్రయోజనాలు పొందినప్పటికీ అవి అన్ని కూడా ధర్మబద్ధంగా మాత్రమే వుండాలని శాస్త్రం హెచ్చరిస్తుంది. ధర్మం కనుక అతిక్రమిస్తే విద్య వలన పొందే ప్రయోజనాలన్నీ విపరీత పరిణామాలకు దారి తీస్తాయి. కాబట్టి సర్వైన లక్ష్యంతో ప్రతివా-రు విద్యను అభ్యసించాలి అని ఆ విద్య వలన కలిగే ఫలితాల సోపాన మార్గాన్ని కూడా ఇలా వి-వరించటం జరిగింది.

కాని నేటి ఆధునిక సమాజం ఈ రకమైన భారతీయ సంప్ర-దాయ విద్యావిధాన లక్ష్యాన్ని వి-స్మరించటం ద్వారా అనేకమంది చదువుకున్న వాళ్ళు కూడా తమ మేధస్సును ప్రజారంజకానికి ఉపయోగించటానికి బదులుగా ప్రజా భంజకానికి వినియో-గిస్తున్నారు. దీనికి అంతటికీ కారణం ఒకటే. చదువుతోపాటు సంస్కారం నేర్చుకోకపోవటమే. సంఘంలో మానవులను గొప్ప వాళ్ళుగా గుర్తించేటట్లు చేసేవి మూడు మాత్రమే. అందులో ఒకటి విద్య, రెండు ధనం, మూడు శక్తి. ఇవి సంస్కారవం-తులైన శీలవంతులైన సజ్జనుల-వద్ద ఉంటే దేశానికి క్షేమదాయ-కం అవుతాయి. లేదా దుర్మార్గుల దగ్గర ఉంటే అవే దేశానికి క్షామ-కారకాలుగా అవుతాయి.

ఇదే విషయాన్ని శాస్త్రకారుడు ఇలా వివరించాడు.

శ్లో ॥ విద్యా వివాదాయ ధనం మదాయ,
శక్తి: పరేషామ్ పరపీడనాయ

ఖలస్య సాధో: విపరీత మేతత్
జ్ఞానాయ దానాయ చ రక్షణాయ ॥

సజ్జనుల వద్దనున్న విద్య జ్ఞానాన్ని ఇస్తుంది. సజ్జనుల ధనం దానధర్మాలకు మంచి కార్యాలకు ఉపయోగపడుతుంది. సజ్జనుల శక్తి సామర్థ్యాలు దేశ రక్షణకు సమాజ హితానికి ఉపయోగ పడతాయి. అలాగే దుర్జనుల వద్దనున్న చదువు వివాదాలకు అనేక అనర్థాలకు దారి తీస్తుంది. దుర్జనుల ఐశ్వర్యం మదాన్ని, అహంకారాన్ని, గర్వాన్ని పెంచుతుంది. అలాగే దుర్జనుల శక్తిసామర్థ్యాలు సాధుజనులను బాధించటానికి సమాజాన్ని పీడిరచటానికి ఉపయోగపడతాయి. కాబట్టి చదువు సంస్కార వంతమైనదిగా ఉండాలి. అప్పుడే ఆ చదువుకున్నవాడు శీలవంతుడుగా సజ్జనుడుగా సమాజంలో రాణిస్తాడు. లేకపోతే ఎంతటి విద్యావంతుడైనా శీలరహితుడైతే ఆ విద్య రాణింపుకు రాదు. శీలం లేనివాడు ఎంత గొప్ప కుటుంబంలో పుట్టినా ఎన్ని వేదాలు, శాస్త్రాలు, పురాణాలు చదివినా అవి ఏవి వారికి సత్ఫలితాలను ఈయజాలవు. దీనినిబట్టి వ్యక్తికి గాని, జాతికి కాని విద్యకంటే శీలమే ముందుగా ఆరాధించవలసిన గొప్ప గుణంగా తెలుస్తుంది. అందుకే మనుచరిత్రలో పెద్దన ప్రవరుని యోగ్యతలను గురించి ఈ విధంగా వర్ణిస్తాడు.

□□శీలంబున్ గుణమున్, శమంబు, దమముం,
జెల్వంబు శీలమున్, లేబ్రాయమున్, బోలంజూచి
ఇతండె పాత్రుడని ఏ భూపాలుడీ వచ్చినన్,
సాలగ్రామము మున్నుగా గొనడు□□. (మనుచరిత్ర)

దీనినిబట్టి శీలమే మానవ జీవన మార్గానికి ఎంతో ప్రముఖమైనది అని తెలుస్తుంది.

నేటి సమాజాన్ని పరిశీలిస్తే విద్యాధికులైన ఎందరో వ్యక్తులు (యువతీయువకులు) ప్రధానంగా శీలరాహిత్యం వలన అధోగతి పాలవుతున్నారు. ఇది చాలా విచారించవలసిన విషయం. అలాగే శీల సంపదను కాపాడుకుంటున్న కారణంగా మరెందరో వ్యక్తులు విద్యాధికులు కాకపోయినప్పటికీ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించినవారూ వున్నారు. కాబట్టి విద్య శీలంతో కలిస్తే అనగా చదువు సంస్కారాలు రెండూ ఏకమైతే ఆ వ్యక్తి కుటుంబ జీవితంలోనే కాదు జాతి జీవితంలోనే ఆనందమయజ్యోతులను వెల్లివిరియిస్తాడు. అపుడే విద్య ప్రయోజనకారి అవుతుంది. అపుడే దేశం సర్వోన్నత స్థితిని పొందుతుంది.

ముగింపు

'ఆనోభద్రా ఋతవో యంతు విశ్వతః
'   `ఋగ్వేదం
"భద్రమైన ఆలోచనలు, అన్నివైపు-లనుండి మనలో ప్రసరించుగాక".
స్వామి వివేకానంద ఉద్ఘోధించిన-ట్లు` 'ఉత్తిష్ఠ జాగ్రత, ప్రాప్యవరాన్ని-వో దిత' Awake - Arise - Stop not till you reach the Goalనేడు భారతీయ యువత 98% అంత-ర్జాతీయ సంస్థల్లో ఉద్యోగం పొం-దడానికి అర్హత సాధింపలేకపోతు-న్నారని, అందుకు విద్యావిధానం అతి ముఖ్యమైన పాత్ర వహిస్తుం-దని గణాంకాలు తెలుపుతున్నాయి. అందుకుగాను విద్యారంగ ప్రక్షా-ళన చేస్తూ జాతీయ విద్యావిధానం NEEP 20రూపొందింప బడిరది. అయితే మనం ఏ విధంగా ఈ వి-ధానాన్ని ఉపయోగం లోకి తీసుకొ-స్తాము. ఏ విధంగా మనం ఫలాల్ని ఆస్వాదిస్తామనేది మన చేతుల్లో ఉంది. ఇందుకుగాను ప్రభుత్వం, విద్యావేత్తలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, పౌరసమాజం తమ తమ బాధ్యతల్ని నిర్వహించాల్సిన అవసరం ఉంది. 'హక్కులు బా-ధ్యతలు' Rights & Responsibilitiesవల్ల మన విద్యావిధానం ప్రపంచ దేశాల్లోనూ 'అగ్రగామి-గా' ఉండాలని, అలనాటి నలందా, తక్షశిల లాంటి ప్రపంచ విఖ్యాత 'విద్యాలయాలు' మనం ఏర్పాటు చేసుకుంటూ 'భారతీయ సాహితీ ` సాంస్కృతిక` వైజ్ఞానిక` వైభవా-న్ని పునః స్థాపిద్దామని ఆశిద్దాం` 'వసుధైవ కుటుంబకమ్' అన్నట్లు సర్వమానవాళి శ్రేయస్సు, విశ్వకల్యా-ణం శాంతి, అహింస మన విద్యావి-ధానం ద్వారా పొందగలమని ఆశి-స్తున్నాను.

కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే
వారేరీ సిరి మూట గట్టుకొని పో వంజాలిరే? భూమిపై
పేరైనం గలదే? శిబి ప్రముఖులున్ బ్రీతిన్ యశః కాములై
యీరే కోర్కెలు? వారిలన్ మఱచిరే యిక్కాలమున్? భార్గవా

(పోతన భాగవతం)

రాజులు, మహారాజులు, చక్రవర్తులు చరిత్రలో కనుమరుగైనారు. కేవలం ఎవరైతే తమ ధర్మాన్ని, దేశాన్ని, సౌభాగ్యాన్ని సర్వమానవాళి శ్రేయ-స్సును కోరి తమ తమ రంగాలలో (విద్య, వైద్య, రాజకీయ, సాంఘిక, సామాజిక మొదలైనవి) స్వార్థాన్ని వదిలి, త్యాగనిరతితో కృషి సల్పినా-రో, సల్పుతున్నారో వారిని సమాజం గౌరవిస్తుంది. వారు యశఃకాములై, కీర్తి ప్రతిష్ఠలతో చరిత్రలో నిలిచిపో-తారు. అందుకు జ్ఞానము మరియు విజ్ఞానముతో కూడిన 'విద్య' సాధనం అవుతుంది, సోపానమవు-తుంది. అందుకే జాతి జీవనంలో 'విద్య' ప్రాధాన్యం మహోన్నతమైనం-ది. 'విద్వాంసుడు' అంటే 'నిష్ణాతు-డు' సర్వత్రా పూజింపబడతాడు, గౌరవింపబడుతాడు.
అందుకే 'విద్య' విధానం పటిష్ఠంగా ఉండాలి. తద్వారా దేశ సమగ్రత, సార్వభౌమత్వం కాపాడబడాలి. ఆనాడు 'ఏక భారత్ ` శ్రేష్ఠ భారత్' సాకారంతో 'విద్య' తన పాత్రను సరిగా పోషించినట్లు భావిస్తా-ను. అందుకు బాధ్యత గల దేశ పౌరుడిగా, అధ్యాపకుడిగా నా సహ-కారాన్ని అందిస్తాను.

జైహింద్

మానవ జీవన రహస్యం

కందాళం రజనీకృష్ణ

భగవంతుని సృష్టిలో అత్యున్నతమైన జన్మ మానవ జన్మ . దైవ సాన్నిధ్యం పొందటానికి భగవంతుడిచ్చిన గొప్ప వరం మానవ జన్మ. అట్టి మానవ జన్మ పరమార్ధం గ్రహించి జీవించుటే కావాలి మానవ జీవన లక్ష్యం. మానవ పుట్టుకలో దాగుంది సృష్టి రహస్యం ...

మానవ జననం

ప్రకృతి పురుషుల సంగమం
నాటింది మరో ప్రాణికి బీజం
బీజం ఇచ్చేను ఒక రూపం
ప్రకృతి పురుషుల ప్రతిరూపం.

అమరేను ఒకొక్క అవయవం
అవయవపొందు తెలిపేను లింగ బేధం
మెలమెల్లగా మారేను పిండరూపం
పెరిగేను ప్రతినెల తల్లిగర్భం.

మలమూత్రాదులలో తిరిగేటి జీవం
తపనతో తిరిగితిరిగి తెలిపేను వైనం
బిడ్డ కదలికతో పొంగేను తల్లి హృదయం
ప్రసవ వేదన సైచి ఇచ్చేను జననం.

భువికి వచ్చేను మరో ప్రాణం
ఉనికిని తెలిపేను బిడ్డ శోకం
పుట్టినప్పుడు శిశువు దైవస్వరూపం అభంశుభం
తెలియని ఆనంద రూపం.

మాయా ప్రపంచంలో అడుగిడిన అనంతరం
అవుతుంది శిశు మనసు కలుషితం
రాగా ద్వేషాలకు అవుతుంది బందితం
అనుభవిస్తుంది ఇలపైన కర్మఫలం.

ఆటు పోటులతో సాగిస్తుంది జీవితం
అవుతుంది ఏదో క్షణం జీవంలేని శవం
కనులు తెరిస్తే జననం
కనులు మూస్తే మరణం
అదే కదా ఈ మానవ జన్మరహస్యం.

మరణించేది ఈ ఈ దేహం ఒకటే. ఆత్మ అన్నది నిరంతరం, శాశ్వతం. మరణానంతరం ఆత్మ చేరుతుంది పిత్రు లోకం. అక్కడ జరుగుతుంది మంచి చెడుల కర్మ ఫల విశ్లేషణం. పాపకర్మల ఫలితంగా చేరుతుంది ఆత్మ మరో శరీరం. అదే మరణాంతరం ఆత్మ ప్రయాణ రహస్యం.....

మరణాంతరం

విగతజీవి చిరునామా దేహం
ఎగిరిపోయింది దేహంలోని ప్రాణం
శాశ్వతమైనది ఒక్కటే ఆత్మస్వరూపం
విడువ లేక పోతోంది భవబంధం.

దేహానికి జరిగేను దహనసంస్కారం
కలతచెందేను వీడిన ఆత్మరూపం
మొదలాయేను భూమిపై కర్మ కాండం
ప్రారంభించేను ఆత్మ పరలోక ప్రయాణం.

తలచేను భూమిపైన గడిపిన క్షణక్షణం
తెలుసుకునేను తన పనుల అరాచకం
తొలగిపోయేను పొరలు కమ్మిన అజ్ఞానం
బోధపడేను మరుసటి జన్మలోని కర్తవ్యం.

తిరిగివచ్చేను అనుభవించగ కర్మఫలం
మరల బందిచేను మోహపాశం
వెలువడేను మనిషి అమానుష్వత్వం
మరచేను మరుజన్మ పరమార్థం.

కామ , క్రోధ , లోభ ,మోహ, మద , మాత్సర్య ఋఇష్టమై, మానవ శరీరం హీన సంస్కారంతో చేసుకుంటుంది జీవితాన్ని పాపపంకిలం. మళ్లీ జననం, మళ్లీ మరణం కాలచక్రంలో సాగేను నిరంతర జీవన పయనం .....

జీవన పయనం

సంసార సాగర జీవన పయనం
ఆటు పోటుల కడలి తరంగం
చుక్కాని లేని నావ జీవితం
తుదకు చేరాలి ఆవలి తీరం.

ఆనంద రూపం మనిషి బాల్యం
అటుపైన పడుతుంది చదువుల భారం
అంతలో వస్తుంది నవ యవ్వనం
మదిలో తెలియని నవ ఉత్సాహం.

మొదలవుతుంది సంసార జంజాటం
సమస్యలతో నిత్యం పోరాటం
ఉదయిస్తుంది మనసులో స్వార్థం
మరుగౌతుంది మనిషిలో మానవత్వం.

కలుగుతుంది మనసులో అసూయ ద్వేషం
పెరుగుతుంది అన్ని పనులలో అరాచకం
మరచేను మనుగడలో దైవ చింతనం
మరో జన్మకు చుట్టేను శ్రీకారం.

....

క్షుద్రమైన మానవ జీవన చక్రంలో తిరిగి, విసిగి వేసారిన ఆత్మ తహతహలాడుతుంది దైవ సన్నిధి కొరకు. కనుగొంటుంది తుదకు జీవన పరమార్థ మార్గం,చేరుతుంది దైవ సానిధ్యం....

దైవసానిధ్యం

జన్మించేను అనుభవించగ పాప ఫలం
అనుభవించేను అహర్నిశం నరక
యాతనం
వీడేను ఒకనాడు అజ్ఞాన గ్రహణం
కనుగొనేను జీవిత పరమార్థ మార్గం.

విడిచిపెట్టేను దేహముపై మమకారం మనిషి
అయ్యేను రాగద్వేషాలుకు అతీతం
విడువక పలికేను హరినామ స్మరణం
వినిపించేను భగవంతుని దివ్య సందేశం.

వెలిగేను మదిలో ప్రేమదీపం
చూడగలిగేను అందరిలో దైవస్వరూపం సర్వజీవు-
లకు చేసేను నమస్కారం
సేవాధర్మంతో జీవించేను నిరంతరం.

ముగిసేను అంతలో జీవన కాలం భగవంతుడు
మెచ్చేను మనిషి త్యాగం ఒసగేను కరుణతో పరి-
పూర్ణ మోక్షం
తిరిగి రాలేదు మరో జన్మ అనంతరం.

....

భగవంతుని సృష్టిలో ప్రతి జీవికి ఒక గమ్యం నిర్దేశింపబడుతుంది. ఆ గమ్యాన్ని తెలుసుకుని , అదే లక్ష్యంగా చేసుకుని, ఆ లక్ష్యాన్ని సాధించటం ధ్యేయంగా జీవించాలి ప్రతి మనిషి . అదే కావాలి మానవ జీవన లక్ష్యం. అదే మానవ జీవన రహస్యం.

****



ప్రేమంటే ఇంతే

ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

(గతసంచికతరువాయి)

"నువ్విక్కడే వుండు, వాళ్ళకి బుద్ధి చెప్పి వస్తాను" అన్నాడు.

"కృష్ణా నువ్వు వెళ్ళద్దు, ఎందుకు మనకి అనవసరమైన విషయాలు, వాళ్ళు నలుగురున్నారు నీకు హాని తలపెట్టవచ్చు"

"కంగారు పడకు ఏమీ అవదు" అని వాళ్ళ దగ్గరకు బయలుదేరాడు కృష్ణమోహన్. అతని వెనకే అనూరాధ కూడా వెళ్ళింది.

వారి వద్దకు వెళ్ళిన తరువాత ఆ నలుగురు తప్ప తాగి వున్నారని, ఆ జంటని వేధిస్తున్నారని అర్ధమయింది.

ఆ అమ్మాయి అనూరాధని గట్టిగా పట్టుకొని "వాళ్ళు అసభ్యకరమైన, అశ్లీలమైన భాషతో మమ్మలిని వేధిస్తున్నారు ఆంటీ" అని ఏడవటం మొదలుపెట్టింది. అనూరాధ ఆ అమ్మాయిని తన అక్కున చేర్చుకొని "భయపడకమ్మా, మేము వచ్చాముగా మీకేమి పరవాలేదు" అని ఓదార్చింది.

కృష్ణమోహన్ ఆ నలుగురిని అక్కడ నుండి వెళ్ళిపొమ్మని చెప్పాడు. కాని వాళ్ళు "సార్ వీళ్ళిద్దరూ ఇక్కడ బహిరంగ ప్రదేశంలో సరసాలాడుకుంటున్నారు, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు అందుకే మందలిస్తున్నాము" అన్నారు.

"అబద్ధాలు చెప్పకండి, మీరు రాక ముందు ఆ అమ్మాయి ఏడుస్తూ వుంటే ఆ అబ్బాయి ఓదారుస్తున్నాడు, వాళ్ళు సరసాలు ఆడటం లేదు, నేను జరిగినదంతా గమనిస్తున్నాను" అన్నాడు కృష్ణమోహన్.

తాము దొరికిపోయామన్న ఉక్రోషంతో ఆ నలుగురిలో ఒకడు "నువ్వెవడివిరా మమ్మలిని అడగటానికి" అని అనూరాధ వంక చూసి "నువ్వు కూడా దాన్ని తీసుకొని వచ్చి ఇక్కడ సరసాలు ఆడుతున్నావని పోలీస్ కంప్లైంట్ ఇస్తాము" అని దురుసుగా కృష్ణమోహన్ మీదకు వచ్చాడు.

అంతే! వాక్యం పూర్తి కాకుండానే అతని చెంప చెళ్ళుమనిపించి "ఏం మాట్లాడుతున్నావో, ఎవరితో మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా? ఊసలు లెక్కట్టాలని వుందా?" అని ఆవేశంగా అన్నాడు కృష్ణమోహన్. అయితే ఆ నలుగురికీ పెద్దగా చదువు లేకపోవడం వలన కృష్ణమోహన్ ఆవేశం, అతని మాటలు, అతని పెరసనాలిటీ చూసి అతనిని పోలీస్ ఆఫీసర్ అనుకున్నారు.

ఇంతలో జనం చాలా మంది గుమిగూడారు. అందులోంచి ఒక వ్యక్తి వచ్చి కృష్ణమోహన్‌కి సెల్యూట్ చేసి "సార్ మీరిక్కడ వున్నారేమిటి ఏం జరిగింది" అని అడిగాడు. కృష్ణమోహన్ జరిగినది చెప్పి"అప్పారావ్ ఈ నాలుగురిని స్టేషనుకి తీసుకుని పద, అనకాపల్లి డి.ఎస్.పి. గారికి ఫోన్ చేసి మాట్లాడుతాను" అన్నాడు.

"సార్ డి.ఎస్.పి. సారు హైదరాబాద్ కేంప్ వెళ్ళారు, వీళ్ళ సంగతి నేను చూసుకుంటాను జీవితంలో ఇంకెపుడూ ఇలాంటి పనులు చెయ్యకుండా వీళ్ళకి బుద్ధి చెబుతాను మీరు నిశ్చింతగా వుండండి, అమ్మగారి-

ని తీసుకుని మీరు వెళ్ళండి" అన్నాడు.

ఇదంతా చూసి ఆ నలుగురు యువకులు భయకంపితులయి కృష్ణమోహన్, అనూరాధల కాళ్ళ మీద పడి "మమ్మల్ని క్షమించండి బుద్ధి గడ్డి తిని అలా మాట్లాడాము ప్రవర్తించాము, మా మీద కేసులు పెడితే మా జీవితాలు నాశనమవుతాయి, ఇంకెపుడూ ఇలాంటి పనులు చేయము మమ్మల్ని వదిలేయండి" అన్నారు.

అనూరాధకి జాలి వేసి "వదిలెయ్యి కృష్ణా" అంది.

అప్పారావుని పక్కకి పిలిచి "వాళ్ళ వివరాలు తీసుకొని, ఎడ్రస్‌లు రాసుకొని, ఇక్కడ దుకాణాల వారందరికి వీళ్ళని చూపించి మళ్ళీ ఎప్పుడైనా పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే నీకు తెలియచెయ్యమను, వాళ్ళకి వార్నింగ్ ఇచ్చి వదిలెయ్యి" అన్నాడు కృష్ణమోహన్.

"అలాగే సార్, మీరు వెళ్ళిరండి"

****

కృష్ణమోహన్, అనూరాధ అక్కడనుండి బయలుదేరి వెళుతూ ఆ జంట కోసం వెనుకకు తిరిగి వాళ్ళిద్దరిని దగ్గరకు పిలిచాడు కృష్ణమోహన్.

"ఆ నలుగురి సంగతీ పక్కన పెడితే, వాళ్ళు రాకముందు నువ్వు ఏడుస్తూ వుంటే ఈ అబ్బాయి ఓదారుస్తున్నాడు. అసలు మీ ఇద్దరూ ఎవరు? మీ సంగతి ఏమిటి" అని వివరం అడిగాడు కృష్ణమోహన్.

"సార్ మా ఇద్దరి వూరు ఇక్కడకు దగ్గరలో వున్న హరిపాలెం. మావి పక్క పక్క ఇళ్ళు మేమిద్దరమూ ప్రేమించుకున్నాము, కానీ మా కులాలు వేరు అందుకని మా పెద్దలు మా పెళ్ళికి ఒప్పుకోవడం లేదు, ఆత్మహత్య చేసుకుందామని ఇక్కడికి వచ్చాము, అందుకే తను ఏడుస్తుంటే నేను ఓదారుస్తున్నాను" అన్నాడు ఆ అబ్బాయి.

అది విన్న కృష్ణమోహన్, అనూరాధ అవాక్కయి ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. కృష్ణమోహన్ ముందు తేరుకొని "నీ పేరేమిటి, నువ్వు ఏం చేస్తున్నావు?" అని ఆ అబ్బాయిని అడిగాడు.

"నా పేరు కిరణ్, తన పేరు సింధు. నేను బి.టెక్. చదివి బొంబాయి దగ్గర థాణేలో వుద్యోగం చేసుకుంటున్నాను, తను బి.కాం. పాస్ అయింది"

"చూడు కిరణ్ మీరిద్దరూ చదువుకున్న వాళ్ళు, పిరికివాళ్ళ లాగ ఇలా ఆత్మహత్య చేసుకుంటే ఎలా? పదండి కారెక్కండి, నేను మీ వాళ్ళతో మాట్లాడుతాను" అన్నాడు కృష్ణమోహన్.

"మా వాళ్ళు ఒప్పుకోరండి, వాళ్ళకి మా కన్నా మా కులాలే ముఖ్యం" అన్నారు కిరణ్, సింధు.

"సరే ప్రయత్నిద్దాము ఒప్పుకోకపోతే అప్పుడు వేరే దారి ఆలోచిద్దాము, రండి కారెక్కండి"

అనూరాధకి అంతా సినిమా చూస్తున్నట్లు వుంది. కృష్ణ ఏం చేస్తాడా అని కుతూహలంగా వుంది. కారు నడుపుతూ "మీ ఇళ్ళకి ఒక రెండు వందల మీటర్ల దూరంలో నేను కారు ఆపుతాను, మీరిద్దరూ కారులోనే కూర్చోండి. మేమిద్దరమూ మీ ఇంటికి వెళ్ళి చిన్న నాటకం ఆడుతాము. నేను మిమ్మల్ని పిలిచేదాకా మీరు కారు దిగద్దు సరేనా" అన్నాడు కృష్ణమోహన్.

హరిపాలెం రాగానే అనుకున్నట్లు కారు ఆపి, కృష్ణమోహన్ రాధ కారు దిగి కిరణ్ సింధుల ఇళ్ళ వైపు వెళుతూ వుండగా తాను ఏం చేయబోతున్నాడో అనూరాధకి వివరించి మన నటనా కౌశల్యాన్ని ఇప్పుడు చూపిద్దాము అన్నాడు.

"నీతో కలిసి నటించడం ఇదే మొదటిసారి" నవ్వుతూ అంది అనూరాధ.

(ఇంకా వుంది)

మా ఊరి నందుల ఆత్మీయ కథ

నందుల ప్రభాకర శాస్త్రి

అవధూత కేశవ నారాయణ స్వామి

ఈ మహా అవధూతను గురించి చెప్పుకుంటే భాకరాపేట చరిత్ర అసంపూర్ణంగానే ఉండిపోతుంది. మా పెద్ద పెద్దనాన్న నందుల పెద్ద సుబ్బరాయుడి కాలంలో 'కేశవ నారాయణ' గారు గవర్నమెంటు ఉపాధ్యాయులుగా వచ్చారు. ఆయనకు వసతి కల్పించి, ఆదరించి, ఒక ఇంటివాడిని కూడా చేశారు ఆరువేల నియోగి బ్రాహ్మడు. తన పనేదో తాను చేసుకుంటూ, పాఠాలు చెప్పుకుంటూ ఉండేవారు. నిత్యానుష్ఠానం, నారాయణ వ్రతం చేసేవాడు. రిటైరుమెంటు తరువాత కూడా భాకరాపేటలోనే ఉండిపోయారు. ఆశ్రమం నిర్మించుకుని పలురకాలైన వ్యాధులను నయం చేస్తుండేవారు. అన్నిటికీ నారాయణ మంత్రం పఠించమనేవాడు. ఆ నారాయణుడే సర్వరోగాలు నివారణ చేస్తాడనేవారు. మా కుటుంబానికి చాలా సన్నిహితంగా ఉండేవారు. మా ఇంటినుండి చిన్న పిల్లవాడు వాళ్ళింటికి పోయినా 'స్వామీ' అని సంబోధించేవారు. అంతటి ఔన్నత్యం గల మనిషి. ఈ అవధూతను గురించి జీవిత చరిత్ర లభ్యమౌతుంది కాబట్టి వీరిని గురించి ప్రత్యేకంగా వ్రాయాల్సిన అవసరం లేదు. అయితే... నాకు తెలిసినంతవరకూ కొన్ని విషయాలు ప్రస్తావిస్తా.

పక్షవాత రోగమొచ్చిన ఒక దళితుడికి నయమవ్వటానికి ఆయన ఇచ్చిన ట్రీట్మెంటు నాకు ఇంకా బాగా గుర్తు ఉంది. ఆ రోగికి ఏడు పసుపు కొమ్ములిచ్చి ట్రీట్మెంట్ ప్రారంభించారు. ఆ రోగి చేయవలసిందల్లా ఒక్కటే. మొదటి రోజు ఒక వృత్తం గీచి ఆ వృత్తంలో ఈ ఏడు పసుపుకొమ్ములు ఉంచాలి. అన్నీ ఒకేసారి ఉంచకూడదు. చొక్కా జేబులో వేసుకుని ఒక్కో పసుపుకొమ్ము తీసుకుని 'నారాయణ' అని ఆ పసుపుకొమ్మును ఆ వృత్తంలో ఉంచాలి. పైకి లేస్తూ 'నారాయణ' అనాలి. అలా ఏడు పసుపుకొమ్ములు

మొదటిరోజు వృత్తంలో పెట్టాలి. అంటే ఏడుసార్లు కూర్చుని, ఏడుసార్లు లేచి, పదునాలుగు-సార్లు 'నారాయణ' అని గట్టిగా అనాలి. ఇలా ఏడురోజులు అయిన తరువాత ఎనిమిదవ రోజు అవన్నీ వృత్తం బయటికి తీయాలి. ఈ వ్యాయామం 'నారాయణ' జపం వల్ల మొద-టివారం లోనే మంచి అభివృద్ధి కనపడేది.

శ్రమజీవనానికి ఎక్కువ విలువ నిచ్చేవాడు. ఎవరిదగ్గరా డబ్బు ఆశించేవాడు కాదు. తీర్థం అందరికీ ఇచ్చేవారు. అయితే ఆశ్రమ నిర్మాణానికి సహకరించమనేవారు. ఆర్థికంగా కాదు. వచ్చేటప్పుడు ఒక్క కంచురాయి మోసుకురమ్మనేవారు.

ఎక్కువమంది భక్తులు సామాన్యులు నిరుపేదలు దళితులే ఉండేవారు. దయ్యాలు పట్టాయని, పిశాచాలు తిరుగుతున్నాయని, సంతానం కలగటం లేదని, చేసిన పని ఏదీ కలిసిరావడం లేదని ఇలా అనేక రకాలైన రుగ్మతలతో వచ్చేవారు. అందరికీ అదే మంత్రం.. అదే తీర్థం.. చాలామందికి నయమయిపోయేది. అలా నయమయినవాళ్ళు తమ పొలంలో పండిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తెచ్చి ఇచ్చేవారు.

ఆశ్రమం కోసం తెచ్చిన రాళ్ళు తప్ప మరేమీ వాడుకునేవాడు కాదు. కూరలు, పండ్లు.. అన్నీ కుళ్లిపోయేవి. వారం రోజుల తర్వాత దిబ్బలో పారేసేవారే కానీ ఆయన తినరు, ఇంకొకరి-కి ఇవ్వరు. మా కుటుంబం బాగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మా పెద్ద మేనత్త, నేనూ వెళ్లాం, బియ్యం, కూరలు ఇస్తారని. ఆయన చెప్పిన మాట విని నిర్ఘాంతపోయాం. 'అవి వాళ్ళ పాప పరిహారార్థం ఇచ్చిన వస్తువులు. అవి తీసుకుంటే.. ఆ పాపం, రోగం మనకు చుట్టుకుంటుంది.

అందుకే.. ఇవి నేను ముట్టను, ఇంకొకరికి ఇవ్వను. ' తీసుకోను అంటే భక్తులు బాధపడతారు, అందుకే తీసుకుంటాను. అంతే' ..

ఆయన చనిపోయిన తర్వాత కొద్దికాలం టీచరు నారాయణ ఆశ్రమ నిర్మాణంలో నాయీ బ్రాహ్మణ సంఘంతో కలిసి పాలు పంచుకున్నాడు. ఆయన ఆశీస్సులు పొందిన చాలామంది 'రెడ్డిగారు' కడప జిల్లా వ్యాప్తంగా ఉండడం వల్ల ఇప్పుడక్కడ నిత్యా కళ్యాణం, పచ్చ తోరణంలా జరిగిపోతోంది. పెద్దగుడి కట్టారు. ఆరాధనలు, ఏకాదశ అభిషేకాలు, పండుగలు, పబ్బాలు, భజనలు, నిత్యం భగవద్గీత పారాయణం... ఆయన మనుమలే ధర్మకర్తలు, పూజారులు. ఎవరు ఏ సమయానికి పోయినా నిత్యాన్న సత్రం నడుస్తూనే ఉంది.

కేశవనారాయణస్వామి జన్మదినాన, అలాగే స్వర్గవాసులైన దినాన, మూడురోజుల ఆరాధన జరుగుతుంది. లోకకల్యాణం కొరకు ధ్యానించిన మనుషుల చరిత్రలు అలా మిగిలిపోతాయి. చూద్దాం అక్కడ ఏం జరుగుతుందో !

నలభై సంవత్సరాల తర్వాత మళ్ళీ భాకరాపేట వెళ్లాను. పెద్దబావి పాడుపడిపోయింది. పెద్ద తోట, చిన్నతోట కంపచెట్ల మయమయింది. ఊర్లో చాలామందికి పొయ్యిలోకి అవే పుల్లలు.

మా ఇంటి స్థలంలో రాళ్ళన్నీ తలా కొన్ని మోసుకున్నారు. ఇంటినిండా సర్కారు తుమ్మచెట్లు మొలిచాయి. అయితే... సంతోషం ఏమిటంటే, అయిదు వేపచెట్లు పెరిగాయి. అమ్మ ఉన్నన్నాళ్లూ ఎక్కడ పడితే అక్కడ తులసి మొక్కలు మొలిచేవి. ఇంటిస్థలంలో కంపచెట్లు కొట్టించి, మట్టి తోలించి, చుట్టూ ఫెన్సింగ్ వేయించి వచ్చాను. చూద్దాం... అక్కడ ఏం జరుగుతుందో!

సమాప్తం!

రుక్మిణీ కళ్యాణం

ధనుర్మాసం ప్రారంభం రోజు డిసెంబర్ 16 న మా స్నేహితులంతా కలిసి సామూహికంగా ఓ స్నేహితురాలింట్లో ఎంతో సంబరంగా, శ్రద్ధగా రుక్మిణీ కళ్యాణం చేసుకున్నాము. ఇది రెండవసారి, మేం ఈవిధంగా కళ్యాణం చేసుకోవడం. మొదటిసారి చేసుకున్నప్పుడు కొన్ని అద్భుతాలు జరిగాయనే చెప్పాలి. పెళ్లిళ్లు ఆలస్యమవుతున్నాయి, 30 ఏళ్ళు దాటిన, ఇంకా పెద్ద వయసున్న పిల్లలకు ఆరు నెలల లోపల పెళ్లిళ్లు అవడం మేము చూసాం. అందుకే మేము మరింత ఉత్సాహంతో, మేమంతా ఈ వ్రతం చాలా భక్తితో ఆచరించాము.

ఇక కథలోకి వెళితే, విదర్భ దేశంలో కుండినమనే నగరం

ఉంది. దానిని భీష్మకుడు పరిపాలించేవాడు. ఆయనకు 5 గురు పుత్రులు - రుక్మి, రుక్మరథుడు, రుక్మ బాహువు, రుక్మకేశుడు మరియు రుక్మనేత్రుడు, ఒక కుమార్తె -రుక్మిణి. రుక్మి తన స్నేహితుడి శిశుపాలునితో రుక్మిణి వివాహం చెయ్యతలుస్తాడు. కానీ, రుక్మిణి, అతిథులవల్ల శ్రీకృష్ణుని రూప బల సద్గుణాలను గురించి విని అతడే తనకు తగిన మగాడిని మనసులో నిశ్చయించుకుంది. రుక్మి ఆలోచనలను గ్రహించిన రుక్మిణి రానున్న ప్రమాదాన్ని ఊహించి మిక్కిలి వ్యధకు గురి అవుతుంది. తన శ్రేయస్సును కోరే గురువు అగ్నిద్యోతుడనే బ్రాహ్మణుని పిలిపించి, 'ఎలాగైనా నీవు ద్వారకకు ఏగి ఆ కృష్ణునికి నా పరిస్థి-

తిని వివరించి అతనిని ఇచటికి తప్పక పిలుచుకు రమ్మని' చెప్పి పంపుతుంది.

అగ్నిద్యోతుని ఆగమనాన్ని వార్తాహరుల ద్వారా విని కృష్ణుడు ఆయనకు సాదర స్వాగతం పలుకుతాడు. గురువు గారు సంతోషించి పెళ్లి-కుమారుడవు కమ్మని ఆశీర్వదించాడు. అప్పుడు కృష్ణుడు ఆయన ఆగమనానికి కారణం అడుగుతాడు. బ్రాహ్మణుడు ఎంతో వినయంతో 'విదర్భరాజు కుమార్తె రుక్మిణి మిమ్ములను వివాహమాడగోరి ఈ శుభవార్త మీకు తెలియజేయమని' నన్ను మీవద్దకు పంపింది.

'ఓ కళ్యాణ స్వరూపా! నీ దర్శన భాగ్యం నేత్రానందకరం, నీ దివ్య నామస్మరణమున భవబంధాలు తొలగుతాయి. నీ సంపద, మంచితనము, బలము, అందము పరాక్రమము, కారుణ్యాము నీ గుణ విశేషాలు తెలిసిన ఏ కన్య నిన్ను వరించకుండా ఉండగలదు? మరి రుక్మిణి కూడా సకల పారంగతురాలే కాక మిక్కిలి సౌందర్యముతో శోభిల్లుతూ, పెద్దలను, గురువులను గౌరవిస్తూ ప్రేమతో కరుణతో ప్రకృతితో మమేకమై ద్విగుణీకృత అందంతో ఉంటుంది' అని రుక్మిణిని గురించి అగ్నిద్యోతుడు వర్ణించాడు. 'మీ ఇద్దరికీ వివాహం జరిగితే ఈడూ జోడూ గా ఉంటారు' అని చెపుతాడు. 'నీమీద మనస్సు కలిగి అన్నగారిని ఎదిరించలేక, ఆ గౌరీ మాతను పూజిస్తూ చింతాక్రాంతియై ఉన్నది' అని కూడా చెపుతాడు. 'వివాహానికి ముందు రాచకన్యలు గౌరీమాతను పూజించే ఆనవాయితీ ఉన్న కారణంగా రుక్మిణి గౌరీమాత ఆలయానికి వచ్చినప్పుడు ఆమెను తీసుకువచ్చి ద్వారకలో వివాహం చేసుకుంటానని, ఆమెకు ఆ విషయం తెలియజేయమని' అగ్నిద్యోతుని ద్వారా శ్రీకృష్ణుడు సందేశం పంపుతాడు.

అన్న రుక్మ ఇష్టప్రకారమే రుక్మిణి వివాహము శిశుపాలునితో నిశ్చయమయినది. తండ్రి భీష్మకుడికి ఇష్టం లేకపోయినా కుమారుని ముందు ఏమీ మాట్లాడలేకపోయాడు. గురువుగారు అందించిన సమాచారంతో గౌరీమాతను నమ్ముకుని కృష్ణుని మాటమీద నమ్మకంతో ముత్తయిదువుల దీవెనలు అందుకుని పెళ్లికూతురు ముస్తాబులో పెళ్లిరోజు గౌరీమాత ఆలయానికి వెళుతుంది రుక్మిణి. రథముపై ఆలయానికి వచ్చిన మురళీధరుడు, మనోహరుడు అయినా కృష్ణుడు జరాసంధుడు, శిశుపాలుడు రుక్మలతో యుద్ధం చేసి బలరాముడు వెంట రాగా రుక్మిణిని ద్వారకకు తీసుకువెళ్లి, వివాహమాడతాడు. రుక్మ ఉక్రోషంతో, అవమానభారంతో తనదేశం విడిచి బయటకు రానని శపథం చేస్తాడు.

తండ్రి దగ్గర లేకుండా బంధువుల మధ్య కాకుండా అన్నని ఎదిరించి వివాహమాడినందుకు రుక్మిణి మనసు ఎంతో వ్యాకులత చెందుతుంది. అప్పుడు బలరాముడు సోదరుని వలె ఆమెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఊరడిస్తాడు. విధివశమున అలా జరిగిందని, కృష్ణ రుక్మిణిల వివాహం భగవత్ నిర్ణయమని వీరే ముల్లోకాలలో ఆదర్శ దంపతులని, ఆమెకు అత్తింట అన్నగా ఉంటానని చెపుతాడు బలరాముడు. అంటే.. మన పిల్లలకు వివాహం చేసినప్పుడు అత్తింట్లో మన పిల్లలకు ఇలాంటి ఆప్యాయత, అనురాగాలు లభించాలని మనమా వ్రతము చేస్తాము. ఈ వ్రతం చేయటంవల్ల వరుడికి ఏమైనా గ్రహ దోషాలు, అకాల మృత్యు దోషాలున్నా తొలగుతాయని అంటారు. ఈ వ్రతం పెళ్లికాని ఆడపిల్లలు11 వారములు చేసుకుని వివాహ నిశ్చయం అయినా తర్వాత, 8 మంది కన్నెపిల్లలకు భోజనం పెట్టి తాంబూలం ఇవ్వాలి. ఎంతో ఆనందంగా ఈ ధనుర్మాసంలో మేము ఈ వ్రతాన్ని ఆచరించాము.

నమస్తే,
మీ భారతీ లక్ష్మి

అత్యంబుపానము

పి ఆర్ శాస్త్రి

ఈ నవీన యుగంలో ఉదయము పూట మంచినీళ్లు త్రాగుటకు అందరూ అలవాటుపడ్డారు. ఇది మంచి అలవాటని మన పూర్వీకులు కూడా శాస్త్రాలలో ఉదహరించారు.

నీటిని ఏవిధంగా తీసుకోవాలి, ఏ సమయంలో, ఎంత మోతాదులో తీసుకోవాలి అనే అవగాహనాలోపం ప్రజలలో కనబడుతోంది. నా వైద్యానుభవము, స్వానుభవం మరియు అనేకమందిని కూడా విచారించి తెలుసుకొంటిని. వారి అభిప్రాయాలను బట్టి ఈ వివరాలను వెలిబుచ్చితిని. శాస్త్ర ప్రకారము మన పూర్వీకులు ఉదాహరించినది ప్రస్తుత పరిస్థితుల ననుసరించి తెలుపుచుంటిని.

నేడు ప్రతి జీవికీ, హైరానాతో కూడిన జీవన ప్రయాణం చాలా సమస్యాత్మికముగాను, యాంత్రికముగాను, మనోభావాల మార్పులు, కాలగతి మార్పులవల్ల చాలా వేగవంతమైన జీవన శైలి నడచుచున్నది. మార్పు మంచిదే కానీ దాని ఉద్ధృతి మనిషి ఆరోగ్యము మీద చాలా దుష్ట ప్రభావము ఆవరించుచున్నది కాన ప్రతి మనిషి ఉదయం 5-6 గంటల మధ్యలోనే 1 లీటరు నీళ్లు, అదీ రాత్రి రాగి చెంబులో నుంచుకున్నవి త్రాగిన పిమ్మట కాలకృత్యములు తీర్చుకున్న పిదప వ్యాయామాలు నడక సాగించుట మంచిదని వాక్పటుడు, ధన్వంతరి వగైరాలు సోదాహరణముగా తెలిపిరి.

ఏ మనిషి అయినా ఆ మనిషి దోసిలి పట్టేంత నీళ్లు ఐదు దోసిళ్ళ నీరే త్రాగాలని శాస్త్రం చెబుతున్నది. ఉదయం సమయమే త్రాగాలి. అంతకన్నా ఎక్కువ త్రాగరాదు. ఎక్కువ తాగినందువల్ల పోనుపోను జీర్ణాశయములో అనేక రుగ్మతలు రావచ్చును.

కవిత్వానికి పర్యాయపదం
డా.ఎన్.గోపి

తుమ్మూరి రాంమోహనరావు

'వేడి వెలుగుగా మారటమే కవిత్వం
విరిగిన కెరటం లేచి నిలబడటమే కవిత్వం'

ఇందులో మొదటి వాక్యం కవితావిర్భావాన్ని, రెండవ వాక్యం కవిత్వ ప్రయోజనాన్నిసంకేతిస్తాయి.

'చూపు కొత్తదికావాలి

ఉత్తది అనుకున్నదంతా

పుత్తడి అవుతుంది'

నానృషిః కురుతే కావ్యం అన్నారు మన పూర్వీకులు.

'రాయక ముందు మనిషి

రాస్తున్న క్షణాల్లో అతడు ఋషి'



తెల్లవారితే కవిత్వం, ముఖప్రక్షాళన చేసుకుంటే కవిత్వం, కాఫీ తాగినా నాస్తా చేసినా కవిత్వమే.
స్నానించడం కవిత్వం,నడవడం కవిత్వం, బస్సు, రైలు, విమానం దేనిలో ప్రయాణించినా కవిత్వమే.

జీవితంలో ప్రతిక్షణాన్ని ఒడిసి పట్టుకుని కవిత్వంగా మలిచేవాడు కనుకనే ‘కాలాన్ని నిద్రపోనివ్వను’ అన్నారు ఈ కవి.

ఈ కవితా సంపుటి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందడం మామూలు విషయం, కాని అదే పుస్తకం ఇరవైమూడు భారతీయ భాషల్లోకి అనువదించబడిన ఏకైక తెలుగు పుస్తకం కావడం విశేషం. అంతే కాదు ఈయన కవిత్వం కొన్ని ప్రపంచ ప్రసిద్ధమైన రష్యన్, చైనీస్, పర్షియన్, అరబిక్, ఇంగ్లీషు వంటి భాషల్లోకి కూడా అనూదితమైంది.

చాలా రోజుల క్రితం చదివిన గోపి గారి కవితా వాక్యం ‘అమ్మ కాల్చిన రొట్టె చంద్రుడిలాఉంది’ ఇప్పటికీ నన్ను వెంటాడుతూ ఉంటుంది. ఎప్పుడు చంద్రుణ్ని చూసినా నాకు ఆకవితా పంక్తి గుర్తుకు వస్తుంది. ఆయనే చెప్పినట్లుగా ఆయన తొలికవిత ‘తంగెడు పూలు’ (1967) ఆయనకు బాగాపేరుతెచ్చింది.పలు కవిసమ్మేళనాల్లో బాగా పేలిన కవిత.



తంగెడు పూలు అంటే ఒప్పు కోను
బంగరుపూలు
పొంగిన విచారాన్ని
దిగమింగిన పూలు

వెలగలిగిన గులాబీలకన్న
వెలవెలబోయే మల్లెలకన్న
వెలలేని ఈ పూలు మేలు



తెలుగువారి బతుకమ్మల
కమ్మని మొగాల
వెలుగు నింపుపూలు
కాపుకన్నెల ముద్దుగొలుపు
ముద్దకొప్పుల్లో కాపురముండే పూలు

మనసున్న పూలు
మమతలున్న పూలు
వాసనలేకున్నా వలపు
బాసలు నేర్చిన పూలు
పేదపూలు పేదలపూలు

తంగెడు పూలు అంటే ఒప్పుకోను
బంగరు పూలు



నిఘంటువులు శోధించి తలబద్ధలు కొట్టుకోవలసిన అవసరం లేదు ఈయన కవిత్వంఅర్థం చేసుకోవడానికి.అలతి పదాలలోనే అసామాన్య భావం పలికించవచ్చని ఆది కవితలోనే నిరూపించుకున్నకవి డా.ఎన్. గోపి.

పల్లవదశలోనే తనలోని కవిత్వాన్ని పసికట్టి ప్రోత్సహించిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీతడా.సి.నారాయణ రెడ్డికి తన తొలి కృతి 'తంగెడుపూలు' ని అంకితం చేయడం తనకెంతోసంతోషం అంటారు ఈయన. దంటే అతిశయోక్తి కాదేమో.

గోపి గారి కవితా ప్రస్థానం నేటికీ నిరాటంకంగా కొనసాగుతున్నది. జీవితాన్ని కవిత్వంగా జీవితాన్ని కవిత్వంగా మలుచుకున్న అరుదైన కవి డా.ఎన్.గోపి. ఆయన కవిత ప్రచురించబడని దినం లేదుప్రచురించని పత్రికలేదంటే అతిశయోక్తి కాదేమో.

గోపి గారితో నా తొలి పరిచయం ఆయన నివాసముండే ప్రాంతంలోనే ఉన్న రామంతాపూర్ దూరదర్శన్ కేంద్రంలో. విరోధినామ సంవత్సరం ఉగాది కవిసమ్మేళనంలో పాల్గొనే అవకాశం నాకు కలిగింది. అప్పుడు వరిష్ఠ కవులతో పాటు వర్ధమానకవులను కూడా కలిపి ఏర్పాటు చేయటం వల్ల లబ్ధప్రతిష్ఠులైన డా.ఎన్.గోపి, డా.అద్దేపల్లి రాంమోహన్ రావు వంటి కవులను కలుసుకునే అదృష్టం కలిగింది.

నా 'మువ్వలు' ఆవిష్కరణ సభకు ఆయన అధ్యక్షత, డా.సి.నారాయణ రెడ్డి గారు పుస్తకావిష్కరణ చేయవలసి ఉండె. కాని అప్పుడు తెలుగు విశ్వవిద్యాలయ వైస్చాన్సలర్ గా అత్యవసర సమావేశ కారణంగా పాల్గొనలేకపోయారు. కాని ఆ తరువాత కొంత కాలానికి నా వచన

కవితా సంపుటి 'నేనెక్కడ్నో తప్పిపోయిన' పుస్తకావిష్కరణ చేయటం, దాని గురించి వారిని వారి ఇంటి వద్ద కలవటం ఆయనతో వ్యక్తిగత పరిచయానికి అనుకూలించింది. పుస్తకావిష్కరణ అనంతరం ఒకసారి ఆయన ఇంటికి వెళ్లినపుడు ఆయన కనబరచిన ఆప్యాయతానురాగాలు ఇప్పటికీ మరువలేను. రెండు సంచుల నిండా ఆయన పుస్తకాలు ఇచ్చి సాగనంపిన సందర్భం కూడా మధుర జ్ఞాపకం.

అందుకే ఆయన మాటల్లోనే,

“ఒక మనిషిని కలిస్తే
మానవత్వం అర్థమైనట్లుండాలి
కవిత్వం చదివినట్లుండాలి”

ఇది నిజం.ఈ రెండు విషయాలూ ఆ రోజు నేను ఆయన్ని కలిసిన తరువాత అనుభూతి చెందాను. గోపి గారిని గురించి రాయటమంటే ఆయన కవిత్వం గురించి రాయటమే.ఎందుకంటేఆయనకు కవిత్వమంటే ఇష్టం,మనిషి అంతకన్నా ఇష్టం.

“కవిత్వం కదిలితే సరిపోదు
ఎదుటివారిని కదిలించాలి
నీ అనుభవాలు వారిలో
జాగృతం కావాలి”

అన్న ఈయన కవితావాక్యాలు కదిలేదీ కదిలించేదీ అన్న శ్రీశ్రీ మాటను గుర్తుకు తేవడం సహజం. తొలి కవితా సంపుటి తంగెడుపూలు(1976) నుండి మనిషిని కలిసినట్టుండాలి(2021) దాదాపు 25 కవితా సంపుటులు వెలువరించిన గోపీ గారు తనే సృష్టించిన నానీలురెండు సంపుటులు వెలువరించారు. నానీల్లో నాలుగు పాదాలుంటాయి. వచన కవిత్వం లాగే ఈ విభజనకు పెద్ద హేతు బద్ధత లేకపోయినా, ఎక్కువ శాతంనానీల్లో మొదటి రెండు పాదాల్లో ఒక భావాంశాల,మూడూ నాలుగు పాదాల్లో ఒకభావాంశాల ఉండి మొదటి దానికి రెండవది సమర్థకంగా ఉంటుంది.



“కుండ ముక్కలైందా
కుమిలిపోకు
మట్టి మరో రూపంకోసం
సిద్ధమౌతుంది”

“స్వప్నాల్ని నమ్ముకున
ఎంతకాలముంటాం
ఆకాశాన్ని ఊపి
చుక్కల్ని రాల్చలేం”

ఒక ఒక ఆలోచనా తటిల్లత ఏదో చటుక్కున మెరిసి మెదడుకు పదును పెడుతుంది.అదీనానీ ప్రత్యేకత.అందుకే 'నానీ'ప్రక్రియ విశేషాదరం పొంది ఆయన స్ఫూర్తి తో వందలాదికవులు నానీ సంకలనాలు వెలువరించటం గోపీ గారి కీర్తి కిరీటంలో కలికి తురాయి.వీరినానీలు పన్నెండు భారతీయ భాషల్లోకి అనువదించబడ్డాయి.

గోపీ గారి 'కాలాన్ని నిద్రపోనివ్వను' తరువాత 'జలగీతం' దీర్ఘకావ్యం కూడా బాగా పేరు తెచ్చుకున్నది. మనిషికిప్రాథమికావసరమైన నీటికి సంబంధించిన అన్ని పార్శ్వాలను కవితాత్మకంగావెలువరించటం దీని ప్రత్యేకత.ఇది 12 భారతీయ భాషల్లోకి అనువదించబడింది.

అలాగే 'వృద్ధోపనిషత్' మరో విశిష్ట రచన.వృద్ధాప్యాన్ని వస్తువుగా చేసిన దీర్ఘ కావ్యానిది.ఇది పది భాషల్లోకి అనువదించబడింది.కేవలం కవిగానే గాకవిమర్శకునిగా, పరిశోధకునిగా, యాత్రాచరిత్ర రచయితగా, అనువాదకు నిగా పలుగ్రంథాలు వెలువరించిన సాహితీ సంపన్నుడు డా.ఎన్.గోపి.

పి.హెచ్ డి పట్టా కోసం తయారు చేసిన సిద్ధాంత గ్రంథం 'ప్రజాకవి వేమన ' ఏడుముద్రణలు పొందింది.వేమన ప్రజా కవి కావడానికి గల మౌలికాంశాలను ఎంతో సమర్ధవంతంగా ఎత్తిచూపారు ఈ పరిశోధన గ్రంథంలో.

వీరి కవితా సంపుటులు కాకుండా,విమర్శా గ్రంథాలు ఆరు,యాత్రా చరిత్రలుఆరు,అనువాదాలు ఆరు కూడా ఉన్నాయి.అమెరికా,జర్మనీ,చైనా,మలేసియా వంటిదేశాలు సందర్శించిన యాత్రానుభూతిని ఇందులో పాఠకులకు అందించారు.

వృత్తి ప్రవృత్తి రెండూ ఒకటే అయ్యే అదృష్టం ఏ కొందరికే లభిస్తుంది. అలాంటి అదృష్టజాతకుల్లో డా.ఎన్ గోపి గారుఒకరు.వీరి మరో భాగ్యమేమిటంటే వీరి శ్రీమతి అరుణ గారు కూడా కవయిత్రి కావడం.

25 జూన్ 1948 లో భువనగిరిలో పేదకుటుంబంలో జన్మించిన గోపీ గారు తెలుగుభాషనుఎంచుకొని ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు ఉపన్యాసకులుగా 33 ఏళ్లు తమసేవలందించారు.1999నుండి 2002 మూడేళ్ల తెలుగు విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ గాపనిచేసారు.ఇంతటి ప్రతిభాశాలియైన కవిని అనేక పురస్కారాలు వెదుక్కుంటూవచ్చాయి.దాదాపు 35 దాక పొందిన అవార్డులలో కేంద్ర సాహిత్య అకాడమీఅవార్డు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న అవార్డు,USA నుండి అన్నమాచార్యఅవార్డు,స్ఫూర్తి అవార్డు,లక్ష్మీనారాయణ జైనీ అవార్డులు వంటి పురస్కారాలు పొందినఘనత డా.ఎన్ గోపీది.



ప్రతిభాశాలి యైన కవిగా ముఖ్యంగా తన కవిత్వం బహు భారతీయ భాషలలోనే గాకవిదేశీ భాషల్లోకి అనువదించబడింద ఏకైక కవిగా,ప్రామాణిక పరిశోధకునిగా,విశిష్టవిమర్శకునిగా, ఉత్తమ అధ్యాపకునిగా,పలు దేశాలు సందర్శించడ వాటిని యాత్రాచరిత్రలుగా అందించిన రచయితగా, అన్నిటికంటే మిన్న మంచి మనిషిగా కలుపుగోలుగా మైత్రీ పాత్రునిగా ఎందరికోఆత్మీయుడై ,స్ఫూర్తి దాయకుడై నిరంతర కవితా రచనా నిమగ్నుడైన డా.ఎన్ గోపి గారుమరిన్ని అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారాలను పొందాలని మనసారా కోరుకుంటున్నాను.

ఆదర్శ జీవితం - శ్రీ మంగళంపల్లి అప్పల నరసింహమూర్తి

అత్యంత ఘనంగా 97 వ జన్మదిన వేడుకలు

1925 వ సంవత్సరం డిశంబర్ 7 వ తేదీన కోనసీమ లోని అమలాపురం తాలూకా కొమరగిరిపట్నం లోని అగ్రహారంలో శ్రీ మంగళంపల్లి అప్పల నరసింహ మూర్తిజన్మించారు. కొమరగిరిపట్నం పల్లెటూరు. ఆ ఊళ్ళో ఎలిమంటరీ స్కూల్లో 5వ తరగతి వరకు, హైస్కూల్లో 10వ తరగతి వరకు పాఠశాలలు ఉండేవి.

శ్రీ అప్పల నరసింహమూర్తి అదే గ్రామంలో చదువుకోవడమే కాక, చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయునిగా 32 సంవత్సరాలు ఎంతో కీర్తి ప్రతిష్టలతో పని చేయడమే కాక, ఆయన తన పిల్లలను కూడా అక్కడే చదివించారు. అంతే కాదు పాఠశాలలో పాఠాలు చెప్పడమే కాక, ఎవరికి చదువులో ఎటువంటి సందేహాలున్నా ఉచితంగా తన పిల్లలతో పాటు పాఠాలు బోధించేవారు. ఆయన తన పిల్లలకి చదువు చెప్పడం మాత్రమే కాక తన పిల్లలతో పాటు ఎందరో విద్యార్థినీ విద్యార్థులకు ఇంటి దగ్గర కూడా చదువు చెప్పడం వారిలోని ప్రత్యేకత. వారంతా కూడా ఎంతో ఉన్నత పదవులలో ఉంటూ, ఇప్పటికీ అవకాశం వచ్చినప్పుడల్లా వారిని కలిసి, ఆశీస్సులు తీసుకుంటూ ఉంటారు. అంతే కాదు వారి కుమారులలో ఒకరైన పెద్ద కుమారుడు పాండురంగ విఠల్ తెలుగు పండిట్ గా చేసి, పదవీ విరమణ పొందారు, అలాగే అదే పాఠశాలలో చదువుకుని, అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా చేస్తూ, ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా కీర్తి ప్రతిష్టలు తెచ్చుకోవడమీ కాక, పాఠశాలను అభి-

వృద్ధి చేస్తూ ఎందరో ప్రశంసలను అందుకుంటున్నారు నరసింహ-మూర్తి గారి మూడవ కుమారుడు మంగళంపల్లి సత్యన్నారాయణ మూర్తి.

ఇక వారి వివాహ జీవితం గురించి తెలుసుకోవాలంటే... వారి భార్య పేరు కాశీ అన్నపూ-ర్ణ, ఆ దంపతులకు 8 మనది సంతానం. నలుగురు ఆడపి-ల్లలు, నలుగురు మగపిల్లలు. ఇంత చక్కటి సంసారం .

కానీ భక్తుణ్ణి భగవంతుడు అలా వదిలేస్తాడా? పరీక్షలు పెట్టడం మొదలు పెట్టాడు. 1970 మార్చి నెలలో ఆయన భార్య ""కాశీ అన్నపూర్ణ" ను ఆయనకు పిల్ల-లకు దూరం చేసాడు. చిన్న చిన్న పిల్లలు పల్లెటూరిలో లంకంత ఇల్లు, అంతంత మాత్రం సదు-పాయాలతో అందరికీ తానే తల్లి, తండ్రి అయి పెంచి పెద్ద చేసి, వారికి కావలసిన చదువులు చెప్పించి, అందరినీ వృద్ధిలోకి తీసుకు వచ్చారు. ఆయన తన జీవితాన్ని త్యాగం చేసి, 32 సం-వత్సరాలు ఉద్యోగ బాధ్యతతో, అనేక మంది పిల్లల అభిమానా-న్ని చూరగొని, ఉత్తమ ఉపాధ్యా-యుడుగా బాధ్యతలు నిర్వహిం-చారు.

ఇంతటి కష్ట కాలంలోనూ సంసార బాధ్యతలలో ఎవరి సహాయ సహకారాలు తీసుకో-కుండా, బంధువులందరితో నూ, అత్యంత ప్రేమగా ఉంటూ వారు, పిల్లలు ఎంతో ఆదర్శంగా నిలిచారు. ఆ పిల్లలంతా తండ్రి అడుగు జాడలలో నడుస్తూ అందరూ ఇప్పటికీ ఎంతో అన్యో-న్యంగా ఉండటం గర్వకారణంగా చెబుతారు అందరూ.

ఇంత కష్టంలోనూ భగవంతు-డు పెట్టే పరీక్షలను సవాలుగా తీసుకుని, కొమరగిరి పట్నంలో ఉన్న సాధువుగారి ఆశ్రమం-లో భజన కార్యాక్రమాల్లో, ఏకాహంలో పాల్గొనేవారు. వారు "సత్యసాయిబాబా" భక్తులు. చాలా కాలం శ్రీ సత్య సాయి సేవాదళ్ సమితి కన్వీనర్ గా పని చేసి సేవ-లనందించారు. పుట్టపర్తి స్వామి ఆశీస్సులతో కొమరగిరిపట్నం-లో 'శ్రీ సత్య సాయి చరణ సేవా సదనం' (భజన మందిరం) స్థా-పనకు సహకారం అందించారు.

పదవీ విరమణ పొందిన తరువాత అమలాపురం లోని "కామాక్షి పీఠానికి" 50,000 రూ., ఎలిమెంటరీ పాఠశాలలో విద్యా-ర్థులకు బెంచీలు అలా వారికి తోచిన దానాలు కూడా ఎన్నో చేస్తూ ఉంటారు.

వారి "97 వ జన్మదినం" రోజున ఆయన పాఠాలు చెప్పిన పా-ఠశాలలో ఆఖరి బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా స్కూల్లో కలిసి ఆనందంగా గడపడమే కాక, పిల్ల లంతా తమ గురువుగారితో కూడా ఆనందంగా గడిపి, వారి ఆశీస్సు-లు అందుకోవడం ఒక ప్రత్యేకత.

Watch later
Share
కాన్పూర్ ఐఐటీ స్నాతకోత్సవం

Watch later
Organization
Organización
Mundial de la Salud
ld Health
anization
ఓమిక్రాన్ గురించి హెచ్చరిస్తున్న WHO

RNI No. TELTEL/2011/39497 JANUARY 2022 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st January Date of Posting:8th January

Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.